FOR ADS.......

ఆకాంక్ష

CONTACT :
8333818121

తొలి ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను

ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...

అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..

సంప్రదించండి...

8333818121

ఎడిటర్ పెనగొండ సతీష్

ఆకాంక్ష akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :226 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ గురువారం-09- ఏప్రిల్ - 2026

## మా దేశం వెళ్లిపోతాం... విశాఖలో డీఆర్వోను ఆశ్రయించిన ఇరాన్ యువతులు



తమను సురక్షితంగా స్వదేశానికి పంపేందుకు సహాయం చేయాలని కోరుతూ వారు విశాఖ జిల్లా అధికారులను ఆశ్రయించారు.

తమను వీలైనంత త్వరగా తిరిగి ఇరాన్‌కు పంపేందుకు ఏర్పాట్లు చేయాలని వారు అధికారులను వేడుకున్నారు.

ఢిల్లి : పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం విశాఖపట్నంలో చదువుకుంటున్న ఇరాన్ విద్యార్థినులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. తమ దేశంలోని కుటుంబ సభ్యులతో సంబంధాలు పూర్తిగా తెగిపోవడంతో, వారి సమాచారం తెలియక తీవ్ర ఆవేదన చెందుతున్నారు. తమను సురక్షితంగా స్వదేశానికి పంపేందుకు సహాయం చేయాలని కోరుతూ వారు విశాఖ జిల్లా అధికారులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే, విశాఖ నగరంలో డీఫార్మసీ చదువుతున్న కొందరు ఇరాన్ యువతులు జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. మిగతా..2లో

## హరీశ్ రావు బహిరంగసభకు అనుమతుల రద్దు



రైతులకు మద్దతుగా ఈ నెల 9న నిర్వహించాలనుకున్న హరీశ్‌రావు బహిరంగ సభకు ప్రభుత్వం అకస్మాత్తుగా అనుమతులు రద్దు చేయడం రాజకీయ దుమారానికి దారితీసింది.

బెదిరింపులకు భయపడి ఉంటే తెలంగాణ వచ్చేదే కాదని నిరంజన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

వనపర్తి జిల్లా రేవల్లి మండలంలో గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి వ్యతిరేకంగా గత 100 రోజులుగా సాగుతున్న రైతుల పోరాటం ఉద్రిక్తంగా మారింది. రైతులకు మద్దతుగా ఈ నెల 9న నిర్వహించాలనుకున్న హరీశ్‌రావు బహిరంగ సభకు ప్రభుత్వం అకస్మాత్తుగా అనుమతులు రద్దు చేయడం రాజకీయ దుమారానికి దారితీసింది. ప్రభుత్వం తొలుత అనుమతినిచ్చి, మిగతా..2లో

## బెంగాల్‌లో లక్షలాది ముస్లిం ఓట్లను న్యాయపరిశీలనలో ఉంచారు



2

★రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో లక్షలాది మంది ముస్లింల ఓటు హక్కును ప్రశ్నార్థకంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

★మణిక్‌చక్‌లో 50 శాతం, బెర్హంపూర్‌లో 61.6 శాతం మంది ముస్లింల పేర్లు పరిశీలన జాబితాలో నిలిచిపోయాయని ఆరోపించారు.

పశ్చిమ బెంగాల్‌లో ఆయా నియోజకవర్గాల్లో పెద్ద మొత్తంలో ముస్లింల పేర్లను న్యాయ పరిశీలన జాబితాలో ఉంచడంపై మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంషేర్‌గంజ్ నియోజకవర్గంలో 55 శాతం మంది ముస్లింలు, మోతాబరిలో 54.2 శాతం, మణిక్‌చక్‌లో 50 శాతం, బెర్హంపూర్‌లో 61.6 శాతం మంది ముస్లింల పేర్లు పరిశీలన జాబితాలో నిలిచిపోయాయని ఆరోపించారు.

## సింగరేణిలో మెడికల్ బోర్డు ఎత్తివేతకు

# కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర....

భట్టి విక్రమార్క అసెంబ్లీ వ్యాఖ్యలపై టిబిజికేఎస్ ఆగ్రహం...

మెడికల్ బోర్డు రద్దయితే భారీ పోరాటాలకు దిగుతాం...

ప్రాతినిధ్య సంఘాలపై ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్...

మీడియా సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్...





గోదావరిఖని//ఏప్రిల్ 8 (ఆకాంక్ష): సింగరేణి సంస్థలో మెడికల్ బోర్డును కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేసే కుట్ర జరుపుతోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు.ఇందుకు నిండు అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలే నిదర్శనమని పేర్కొన్నారు. బుధవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిబిజికేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో సింగరేణి సంస్థలో కార్మికుల సంఖ్య అధికంగా ఉందని, దీనిపై విచారణ జరపాలని ఉప ముఖ్యమంత్రి పేర్కొనడం వెనుక గల ఉద్దేశ్యంపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ప్రకటనలతో మెడికల్ బోర్డును పూర్తిగా ఎత్తివేసే ప్రయత్నం జరుగుతోందన్న సందేహాలు బలపడుతున్నాయని అన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమానికి మిగతా..2లో

## అబద్ధాలతో అధికార పార్టీ..

## నిద్రమత్తులో బీఆర్ఎస్ పార్టీ

- కొత్త నెత్తురు, కొత్త రాజకీయంతో తెలంగాణ భవిష్యత్తును మారుస్తామని..
- వెలుగుమట్ల తరహాలో ప్రజల్లోనే ఉండి సమస్యలపై పోరాడతామని
- కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో ప్రజలను వంచిస్తోంది. రాష్ట్ర పాలన మొత్తం దిల్లీ నుంచే జరుగుతోంది.



హైదరాబాద్: తెలంగాణ చరిత్రను మార్చే, భవిష్యత్తును తీర్చిదిద్దే పార్టీ ఈ నెల 25వ తేదీన వస్తుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఆవిర్భావం రోజు అద్భుతమైన ఎజెండా ప్రకటిస్తామని చెప్పారు. కొత్త నెత్తురు, కొత్త రాజకీయంతో తెలంగాణ భవిష్యత్తును మారుస్తామని.. దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. గద్వాల నియోజకవర్గానికి చెందిన నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్, ఆయన అనుచరులు తెలంగాణ జాగృతిలో చేరారు. కవిత వారికి కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాగృతి తరఫున ప్రశ్నిస్తాం... పోరాడతాం.. పరిష్కరిస్తామని తెలిపారు. వెలుగుమట్ల తరహాలో ప్రజల్లోనే ఉండి సమస్యలపై పోరాడతామని అన్నారు. "బీఆర్ఎస్ పార్టీ అచేతన స్థితిలో ఉంది.. నిద్రపోతోంది. మిగతా..2లో

## తెలుగు రాష్ట్రాలకు

# భారీ వర్ష సూచన..

★తెలుగు రాష్ట్రాల్లోని వాతావరణ పరిస్థితులపై కీలక అప్‌డేట్ వచ్చింది.

★ రెండు రాష్ట్రాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములు, మెరుపులతోపాటు

★ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.



హైదరాబాద్/అమరావతి, ఏప్రిల్ 08: తెలుగు రాష్ట్రాల్లోని వాతావరణ పరిస్థితులపై కీలక అప్‌డేట్ వచ్చింది. రెండు రాష్ట్రాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములు, మెరుపులతోపాటు ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న ఉపరితల ఆవర్తనం నుంచి తెలంగాణ, రాయలసీమతోపాటు తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉత్తర, దక్షిణ ద్రోణి ఏర్పడిందని పేర్కొంది. దీని ప్రభావంతో ఏపీలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు చేసింది.

**ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం..**

మిగతా..2లో

## ఇరాన్ ఒప్పందం ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి



2

- "వారు నిజాయతీగా చర్చలు జరిపితే, మేం కచ్చితంగా ఒక విస్తృత ఒప్పందాన్ని కుదుర్చుకోగలుగుతాం.
- "కీలక జలమార్గాలను తెరవండి, మేం కాల్పుల విరమణకు సిద్ధమవుతాం అని అధ్యక్షుడు స్పష్టంగా చెప్పారు"

అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతల తర్వాత కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం గంటల వ్యవధిలోనే ఒత్తిడికి గురవుతోందని అమెరికా వైస్ ప్రెసిడెంట్

## జగిత్యాల రూరల్‌లో విషాదం...

## గుండెపోటుతో మూడో తరగతి విద్యార్థి మృతి....



జగిత్యాల//ఏప్రిల్08(ఆకాంక్ష ) : జగిత్యాల రూరల్ మండలంలో హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులతో కలిసి దేవాలయంలో ఆనందంగా గడిపిన ఓ చిన్నారి అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతిచెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటన మండలంలోని పొరండ్ల గ్రామంలో బుధవారం జరిగింది.గ్రామానికి చెందిన తోపారపు చంద్రశేఖర్-నవిత దంపతుల కుమారుడు నిశాంత్ (9) గ్రామ ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. బుధవారం గ్రామ శివారులో ఉన్న శివాలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యాడు. అక్కడ తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటూ ఆనందంగా గడిపిన నిశాంత్ ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు.ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్న వయసులోనే గుండెపోటుతో బాలుడు మృతిచెందడం గ్రామంలో చర్చనీయాంశమైంది.ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగి పోయారు. వారి ఆర్తనాదాలు గ్రామస్తులను కలచివేశాయి. ఈ ఘటనతో పొరండ్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## కష్టపడిన వారిని గుర్తించడమే

# టీడీపీ సిద్ధాంతం



2

★తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించడమే తమ సిద్ధాంతమని మంత్రి నారా లోకేశ్ అన్నారు.

★పార్టీకి అండగా నిలిచిన వారిని ఎప్పటికీ విస్మరించేది లేదన్నారు.

అమరావతి: తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించడమే తమ సిద్ధాంతమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. పార్టీకి అండగా నిలిచిన వారిని ఎప్పటికీ విస్మరించేది లేదన్నారు.

## తెలంగాణ ప్రజలకు గుడ్ న్యూస్..

# కొత్తగా రెండు విమానాశ్రయాలు..

తెలంగాణ ప్రజలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గుడ్ న్యూస్ చెప్పారు.

రాష్ట్రంలో మరికొన్ని రోజుల్లో రెండు నూతన విమానాశ్రయాలు నిర్మించబోతున్నట్లు ప్రకటించారు.

వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎయిర్‌పోర్టులు నిర్మించనున్నట్లు తెలిపారు.





వరంగల్: తెలంగాణ ప్రజలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గుడ్ న్యూస్ చెప్పారు. రాష్ట్రంలో మరికొన్ని రోజుల్లో రెండు నూతన విమానాశ్రయాలు నిర్మించబోతున్నట్లు ప్రకటించారు. వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎయిర్‌పోర్టులు నిర్మించనున్నట్లు తెలిపారు. వరంగల్ విమానాశ్రయానికి మూడు నెలల్లో శంకుస్థాపన జరగనుందని కేంద్ర మంత్రి శుభవార్త చెప్పారు. అలాగే ఆదిలాబాద్‌లోనూ

## వచ్చే ఏడాది నా పాదయాత్ర...

## చంద్రబాబుకు సినిమా చూపిస్తాం

- కూటమి ప్రభుత్వం "దోచుకో.. పంచుకో.. తినుకో.." అనే సిద్ధాంతంతో పాలిస్తోందని
- వచ్చే ఏడాది తాను పాదయాత్ర ప్రారంభిస్తానని, అప్పటి నుంచి చంద్రబాబుకు ప్రతిరోజూ సినిమా చూపిస్తామని జగన్ హెచ్చరించారు.
- గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రగతిని తిరోగమనంలోకి నెట్టారని జగన్ ఆవేదన వ్యక్తం



2 లో

అమరావతి :కూటమి ప్రభుత్వం "దోచుకో.. పంచుకో.. తినుకో.." అనే సిద్ధాంతంతో పాలిస్తోందని వైసీపీ అధినేత జగన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన చంద్రబాబు పాలనా తీరును ఎండగట్టారు.

మొదటి పేజి తరువాయి

## సింగరేణిలో మెడికల్ బోర్డు ఎత్తివేతకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర...

మెడికల్ బోర్డు కీలకమని, దాన్ని తొలగించడం కార్మికులకు తీవ్ర అన్యాయం అవుతుందని ఈశ్వర్ పేర్కొన్నారు. అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను టిబిజికేఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వాలు సింగరేణిలో కార్మికుల సంఖ్యను తగ్గిస్తూ వచ్చాయని, అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కారుణ్య నియామకాల ద్వారా దాదాపు 20 వేల ఉద్యోగాలు కల్పించారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా మెడికల్ బోర్డును రద్దు చేసే దిశగా చర్యలు తీసుకుంటోందని విమర్శించారు.మెడికల్ బోర్డును ఎత్తివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తే టిబిజికేఎస్ భారీ స్థాయిలో పోరాటాలకు దిగుతుందని హెచ్చరించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఏ స్థాయికైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. అలాగే ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ వంటి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక పోయాయని విమర్శించారు. అలాంటి సంఘాలకు ప్రాతినిధ్య హక్కు ఉండదని, వెంటనే ఎన్నికలకు వెళ్లి తమ అర్హతను నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. సింగరేణి ఎన్నికల సమయంలో కార్మికుల పక్షాన పోరాడతామని కార్మికుల సంక్షేమ ధ్యేయమని చెప్తూ వచ్చిన గుర్తింపు కార్మిక సంఘం కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిలో మెడికల్ బోర్డుని ఎత్తి వేసే కుట్ల చేస్తుంటే ఎందుకు మనం పాటిస్తుందని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కార్మికులకు మాయ మాటలు చెప్పి గుర్తింపు సంఘంగా గెలిచి కార్మిక సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతుందని ఆరోపించారు. సింగరేణి కార్మికుల విషయంలో ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎందుకు గుర్తింపు కార్మిక సంఘం వ్యతిరేకించడం లేదని ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని ఆయన గుర్తింపు కార్మిక సంఘాన్ని ప్రశ్నించారు. కార్మిక సమస్యలను నీరుగారుస్తున్న గుర్తింపు సంఘానికి గుర్తింపు సంఘంగా ఉండే అర్హత లేదని సింగరేణి ఎన్నికలు నిర్వహించాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిబిజికేఎస్, బీఆర్ఎస్ నాయకులు నూనె కొమురయ్య, గోపు ఐలయ్య యాదవ్, వడ్డేపల్లి శంకర్, మల్లేశం, మదాసు రామ్మూర్తి, చెలుకలపల్లి శ్రీనివాస్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజలకు గుడ్ న్యూస్.. కొత్తగా రెండు విమానాశ్రయాలు..

మరో కొత్త ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ శాఖ నిర్ణయం తీసుకుందని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.ఆదిలాబాద్‌లో రక్షణ శాఖకు చెందిన 360 ఎకరాల్లో నూతన ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ పేర్కొన్నారు. ఈ విమానాశ్రయాన్ని రక్షణ శాఖ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. రక్షణ శాఖకు సంబంధించి శిక్షణ కోసం ఈ విమానాశ్రయాన్ని వినియోగించుకోవాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించినట్లు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. అదే విమానాశ్రయంలో పౌర విమానయాన శాఖ టెర్మినల్ నిర్మాణం చేసుకునేందుకు రక్షణ మంత్రి అంగీకారం తెలిపారని ఆయన చెప్పారు. రక్షణ శాఖ అవసరాలతోపాటు సాధారణ విమాన సర్వీసులు కూడా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ తెలిపారు. ఈనెల 17వ తేదీన అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం రక్షణ శాఖ తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. త్వరలోనే వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణం ప్రారంభం కానుందంటూ తీపి కబురు చెప్పారు. సుమారు 430 ఎకరాలుంటే ఎయిర్ బస్ రాకపోకలకు వీలుగా విమానాశ్రయం ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు. ఇదే విషయంపై మరో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. వరంగల్ విమానాశ్రయానికి సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్ స్ట్రిప్ ఉందని.. ఆ స్థలంలో నూతన విమానాశ్రయం కట్టాలని చాలాకాలంగా డిమాండ్ ఉందని చెప్పుకొచ్చారు. ఈ విషయంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి చర్చించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు.

## వచ్చే ఏడాది నా పాదయాత్ర... చంద్రబాబుకు సినిమా చూపిస్తాం

వచ్చే ఏడాది తాను పాదయాత్ర ప్రారంభిస్తానని, అప్పటి నుంచి చంద్రబాబుకు ప్రతిరోజూ సినిమా చూపిస్తామని జగన్ హెచ్చరించారు. గత ప్రభుత్వంలో తాము చేసిన అప్పుల్లో మెజారిటీ వాటా (రూ. 2.73 లక్షల కోట్లు) నేరుగా డీబీటీ ద్వారా ప్రజల ఖాతాల్లోకి చేరిందని తెలిపారు. చంద్రబాబు ఈ రెండేళ్లలోనే రూ. 3.52 లక్షల కోట్ల అప్పు చేశారని... ఈ నిధులన్నీ ఎవరి జేబుల్లోకి వెళుతున్నాయని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు చెత్తబుట్టలోకి వెళ్లాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రగతిని తిరోగమనంలోకి నెట్టారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు.

## కష్టపడిన వారిని గుర్తించడమే టీడీపీ సిద్ధాంతం

'మై టీడీపీ యాప్' టాప్-10 ఫెర్మార్మర్లతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వారితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'మై టీడీపీ యాప్' సమర్థ వినియోగం, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడంపై మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. మీ పని తీరే ఇక్కడి వరకు రావడానికి కారణమంటూ కొనియాడారు. ఉత్తమ కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం మరింతగా కష్టపడాలని, టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి లోకేశ్ భరోసా కల్పించారు.

## మా దేశం వెళ్లిపోతాం... విశాఖలో డీఆర్వోను ఆశ్రయించిన ఇరాన్ యువతులు

అక్కడ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) విశ్వేశ్వరనాయుడిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. యుద్ధం కారణంగా ఇరాన్‌లోని తమ కుటుంబాలతో మాట్లాడలేకపోతున్నామని, వారి యోగక్షేమాల గురించి సమాచారం తెలియక తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నామని వివరించారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో తాము ఇక్కడ ఉండలేమని, తమను వీలైనంత త్వరగా తిరిగి ఇరాన్‌కు పంపేందుకు ఏర్పాట్లు చేయాలని వారు అధికారులను వేడుకున్నారు. విద్యార్థినుల విజ్ఞప్తిని స్వీకరించిన అధికారులు, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

## నాదర్‌గూల్ భూముల వ్యవహారంపై హరీశ్ రావుకు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్

నిర్మాణాలు ప్రారంభమయ్యాయని అన్నారు. ఆ సమయంలో బీఆర్ఎస్ అధికారంలో ఉందని గుర్తు చేశారు. తమకు నాలా కన్వర్షన్ ఇవ్వలేదని భూములు పొందినవారు 2022లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తే, నాటి కేసీఆర్ ప్రభుత్వం కనీసం కౌంటర్ దాఖలు చేయలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చాక ఆ భూములు ప్రభుత్వానివేనని కౌంటర్ దాఖలు చేశామని వెల్లడించారు. నాడు వాటాల కోసం భూములు కట్టబెట్టిన వారు ఇప్పుడు తమపై నిందలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావు చెబుతున్న కంపెనీల్లో తన కుటుంబ సభ్యులు ఎవరూ లేరని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నాదర్‌గుల్ భూముల వ్యవహారానికి సంబంధించిన కంపెనీల్లో తన కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే నిరూపించాలని సవాల్ చేశారు. కాగా, నాదర్‌గూల్ భూముల వ్యవహారంపై ఇటీవల రాజకీయ దుమారం చెలరేగుతోంది. రూ.7 వేల కోట్ల విలువైన 373 ఎకరాల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టిందని హరీశ్ రావు ఆరోపిస్తున్నారు. అయితే ఈ భూమి యజమాని ఏక్యూ రియాల్టర్ అని చెబుతున్నారు. ఇది ప్రైవేటు భూమి అని హైకోర్టు, సుప్రీంకోర్టు గుర్తించాయని ఏక్యూ రియాల్టర్ అడ్వకేట్ ఇటీవల తెలిపారు.

## అబద్ధాలతో అధికార పార్టీ.. నిద్రమత్తులో బీఆర్ఎస్ పార్టీ

గద్వాలలో చేనేత, పత్తి రైతులకు అన్యాయం జరుగుతుంటే కూడా ప్రశ్నించడం లేదు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో ప్రజలను వంచిస్తోంది. రాష్ట్ర పాలన మొత్తం ఢిల్లీ నుంచే జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంగా మారింది. ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై పోటీ చేస్తే జోగులాంబ జిల్లాలో తెలంగాణ జాగృతికి మొదటి విజయం దక్కింది. ఎమ్మెల్యే సీట్లలో మొదట గద్వాలలోనే విజయం సాధిస్తామని విశ్వాసం ఉంది. చూస్తుంటే గద్వాల గడీ మీద ఉద్యమకారుల జెండా ఎగురుతుందని అనిపిస్తోంది" అని కవిత అన్నారు

## ఖరీఫ్ సీజన్‌లో న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,534 కోట్లు.. కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం

అరుణాచల్ ప్రదేశ్‌లోని కమ్లే, క్రా దాది-కురుంగ్ కుమే జిల్లాల్లో రూ.26,069.50 కోట్లతో 1720 మెగావాట్ల ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు 96 నెలల్లో పూర్తవుతుందని అంచనా వేశారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజావ్ జిల్లాలో 1200 మెగావాట్ల కళాయి-2 హైడ్రో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.14,105.83 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

## బెంగాల్‌లో లక్షలాది ముస్లిం

# రోడ్ల నిర్మాణంతోనే జాతి నిర్మాణం, ఆర్థిక ప్రగతి

రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన రాజమండ్రి, కాకినాడ, తిరుపతి, కర్నూలు, నెల్లూరు వంటి ప్రాంతాల్లో ఔటర్ కారిడార్ మోడల్స్‌ను అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. నగరాలకు రింగ్ రోడ్లు నిర్మించడం వల్ల ఆయా ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం అవుతాయని, ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. పొరుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన నగరాలను ఏపీతో అనుసంధానించేలా రహదారుల నిర్మాణం జరగాలని స్పష్టం చేశారు.

రహదారుల పటిష్ఠ నిర్వహణపై సీఎం దృష్టి

రాష్ట్రంలో రహదారుల నిర్వహణ అత్యంత పటిష్టంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 45,433 కిలోమీటర్ల రోడ్లలో, ఏటా 10,238 కిలోమీటర్ల మేర నిరంతర నిర్వహణ చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. రోడ్లపై గుంతలు పడిన వెంటనే మరమ్మతులు చేపడితే సమస్యలు ఉండవని, ఇది నిరంతర ప్రక్రియగా సాగాలని సూచించారు. రోడ్ల నిర్వహణలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ రహదారుల నిర్వహణకు నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు నల్లరేగడి నేలలున్న ప్రాంతాల్లో హైబ్రీడ్ మోడల్‌లో బీటీ లేదా వైట్ ట్యాప్ రోడ్లు నిర్మించాలని, కాలువ గట్ల వెంబడి తరచూ దెబ్బతింటున్న 570 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి కొత్త సాంకేతికతపై యూనివర్సిటీలతో అధ్యయనం చేయించాలని సూచించారు.

గోదావరి పుష్కరాలకు ప్రత్యేక కార్యాచరణ

రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యంగా గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని 471 గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. గ్రేటర్ రాజమహేంద్రవరం పరిధిలో చేపట్టే



రహదారుల అభివృద్ధి పనులు రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలవాలని ఆకాంక్షించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పుష్కరాల కోసం రూ.400 కోట్ల 'సాస్కి' నిధులతో 531 కిలోమీటర్ల పొడవైన రహదారులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. కుంభమేళా తరహాలో పుష్కరాలకు నిధులు కేటాయించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులకు సూచించారు.

### పోర్టుల అనుసంధానమే లక్ష్యం

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పోర్టులు గుండెకాయ వంటివని, వాటిని కలుపుతూ జాతీయ రహదారుల నిర్మాణం జరగాలని చంద్రబాబు అన్నారు. పశ్చిమ భారతంలో గుజరాత్ మోడల్ తరహాలో, తూర్పు తీరంలో ఆంధ్రప్రదేశ్‌ను పోర్టుల హబ్‌గా తీర్చిదిద్దాలని చెప్పారు. ఈస్ట్-వెస్ట్ కారిడార్ల నిర్మాణంతో లాజిస్టిక్స్ వ్యయాన్ని గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. మూలపేట, విశాఖ, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులను అనుసంధానిస్తూ, పొరుగు రాష్ట్రాల సరిహద్దుల వరకు ప్రత్యామ్నాయ మార్గాలను కూడా నిర్మించాలని చెప్పారు. దీనికి అవసరమైన ఆర్థిక వనరులను 'ఏపీ లింక్' ద్వారా సమకూర్చుకోవాలని సూచించారు.

ఆర్థిక ప్రగతికి జాతీయ రహదారుల కీలకం

"జాతీయ రహదారుల నిర్మాణంతోనే జాతి నిర్మాణం జరుగుతుంది" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. రహదారుల నిర్మాణం ద్వారా సమీప ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరగాలన్నారు. పారిశ్రామిక, ఉద్యాన ఉత్పత్తులకు కేంద్రంగా మారుతున్న ఏపీ నుంచి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు సరుకు రవాణా సులభతరం కావాలని చెప్పారు. ఖరగ్ పూర్-అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే, హైదరాబాద్-శ్రీశైలం-దోర్నాల, కల్వకుర్తి-నంద్యాల వంటి జాతీయ రహదారులతో కనెక్టివిటీ మరింత పెరుగుతుందని తెలిపారు. రాబోయే రెండేళ్లలో 1335 కిలోమీటర్ల జాతీయ రహదారులు అందుబాటులోకి వస్తాయని, ఈ ఏడాదిలోనే రూ.24,502 కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించారు.

### తక్కువ వ్యయంతో ఈవీ బస్సులు

ప్రజా రవాణాను అతి తక్కువ వ్యయంతో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, దీనికి ఎలక్ట్రిక్ బస్సుల వినియోగమే సరైన మార్గమని చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం కిలోమీటరుకు రూ.72గా ఉన్న ఈవీ బస్సు నిర్వహణ వ్యయాన్ని తగ్గించేందుకు వివిధ మోడళ్లను అధ్యయనం చేయాలని సూచించారు. ఛార్జింగ్ స్టేషన్లు, బ్యాటరీ స్టాండర్డైజేషన్ వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. అన్ని కేటగిరీల్లోనూ ఏసీ ఈవీ బస్సులనే నడపాలని, ప్రజల్లో ఈ-సైకిళ్ల వినియోగాన్ని ప్రోత్సహించి దానిని ఒక మాస్ ట్రాన్స్‌పోర్ట్‌గా మార్చాలని సీఎం స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం, జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన..

మొదటి పేజి తరువాయి

బుధవారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి రెండు ప్రాంతాల్లో కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు వేగంతో వీస్తాయని చెప్పింది. ఇక గురు, శుక్రవారాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని వివరించింది.

### దక్షిణ కోస్తా ఏపీలో..

బుధ, గురు వారాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందంది. ఉరుములతో కూడిన మెరుపులు సంభవించే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయంది. శుక్రవారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందంది.

### రాయలసీమలో..

బుధవారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని తెలిపింది. గురు, శుక్ర వారాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని పేర్కొంది.

### తెలంగాణలో రాగల మూడు రోజుల వాతావరణ పరిస్థితులు..

ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో ఉపరితల చక్రవాత ఆవర్తనం సముద్ర మట్టం నుంచి 0.9 కిలోమీటర్ల ఎత్తులో బుధవారం ఏర్పడిందని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని



ప్రభావంతో ఈ రోజు (బుధవారం) తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు ఒకటి రెండు జిల్లాల్లో కురిసే అవకాశం ఉంది. రానున్న మూడు రోజులు రెండు నుంచి మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఈ రోజు రాష్ట్రంలోని ఒకటి.. రెండు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని తెలిపింది.

# ఇరాన్ ఒప్పందం ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి

మొదటి పేజి తరువాయి

జేడీ వాన్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది చాలా 'బలహీనమైన ఒప్పందం' అని, టెహ్రాన్‌లోని అంతర్గత విభేదాల కారణంగా ఇది ఏ క్షణంలోనైనా విఫలం కావచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ ఇరాన్ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. బుడాపెస్ట్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ వాన్స్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. అధ్యక్షుడు ట్రంప్ తమను నిజాయతీగా చర్చలు జరపమని ఆదేశించారని, అయితే తమ సహనానికి కూడా ఒక హద్దు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. "వారు నిజాయతీగా చర్చలు జరిపితే, మేం కచ్చితంగా ఒక విస్తృత ఒప్పందాన్ని కుదుర్చుకోగలుగుతాం. కానీ, వారు అబద్ధాలు చెప్పినా, మోసం చేసినా.. దాని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి" అని వాన్స్ హెచ్చరించారు. అవసరమైతే తమ వద్ద స్పష్టమైన సైనిక, దౌత్య, అసాధారణ ఆర్థిక పరపతి ఉందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతానికి ఈ సంధి ఒక స్వల్పమైన దౌత్యపరమైన అవకాశాన్ని మాత్రమే కల్పించిందని, చర్చల్లో ఇరాన్ ఎలా వ్యవహరిస్తుందనే దానిపైనే తదుపరి దశ ఆధారపడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కొన్ని గంటల క్రితమే కుదిరిన ఈ ఒప్పందం కేవలం ఘర్షణలకు తాత్కాలిక



విరామం మాత్రమేనని, దీని భవిష్యత్తుపై అనిశ్చితి కొనసాగుతోందని ఆయన అన్నారు. "ఈ ఒప్పందం కుదిరి కేవలం 8 నుంచి 12 గంటలు మాత్రమే అయింది. అందుకే ఇది బలహీనమైన సంధి అని నేను చెబుతున్నాను" అని వాన్స్ వివరించారు. ప్రపంచ వాణిజ్యానికి ఆటంకం కలిగిస్తున్న కీలకమైన నౌకా మార్గాలను తిరిగి తెరవాలని, ఘర్షణ పూరిత చర్యలను నిలిపివేయాలని అమెరికా ఇచ్చిన అల్టిమేటం తర్వాతే ఈ ఒప్పందం కుదిరింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు చర్చలు జరిపినట్లు వాన్స్ తెలిపారు. "కీలక జలమార్గాలను తెరవండి, మేం కాల్పుల విరమణకు సిద్ధమవుతాం అని అధ్యక్షుడు స్పష్టంగా చెప్పారు" అని ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం, వ్యూహాత్మక జలమార్గాల గుండా నౌకల రాకపోకలను పునరుద్ధరించడానికి ఇరాన్ అంగీకరించింది. దీనికి బదులుగా, అమెరికా, దాని మిత్రదేశాలు సైనిక దాడులను నిలిపివేశాయి. అయితే, కాల్పుల విరమణకు ముందే అమెరికా తన సైనిక లక్ష్యాన్ని సాధించిందని వాన్స్ స్పష్టం చేశారు. "ఇరాన్ సైనిక శక్తిని నిర్వీర్యం చేయడమే మా అధ్యక్షుడి లక్ష్యం. ఆ లక్ష్యం ఇప్పటికే నెరవేరింది" అని అన్నారు. ఒప్పందం కుదిరినప్పటికీ, ఇరాన్ నాయకత్వంలోని భిన్నాభిప్రాయాలు పరిస్థితిని క్లిష్టతరం చేస్తున్నాయని వాన్స్ ఆందోళన వ్యక్తం చేశారు. "ఇరాన్‌లో కొందరు ఈ ఒప్పందాన్ని సానుకూలంగా స్వాగతిస్తుంటే, మరికొందరు మాత్రం మేం సాధించిన దాని గురించి, ఒప్పందం స్వభావం గురించి పూర్తిగా అబద్ధాలు చెబుతున్నారు. కాల్పుల విరమణపైనా తప్పుడు ప్రచారం చేస్తున్నారు" అని ఆరోపించారు. ఈ అంతర్గత వైరుధ్యాలే సంధి బలహీనంగా ఉండటానికి ప్రధాన కారణమని, జాగ్రత్తగా వ్యవహరించకపోతే అది విఫలమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

# పెట్టుబడిదారీ విధానమే.. యుద్ధాల మూలం!

పాలకులు చాలా సందర్భాల్లో ప్రజలకన్నా కార్పొరేట్ల ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనే భావన ఉంది. దీనివల్ల సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతోంది. సహజ వనరులు, ఉత్పత్తి వ్యవస్థలు పెద్ద కార్పొరేట్ల నియంత్రణలోకి వెళ్తున్నాయి. వివిధ దేశాల మధ్య యుద్ధాలు కూడా వనరులు, ఆర్థిక ఆధిపత్యం కోసం జరుగుతున్నాయని విమర్శ ఉంది. ప్రభుత్వాలు పన్ను రాయితీలు, విధానాల ద్వారా కార్పొరేట్లకు మద్దతు ఇస్తున్నాయని అంటారు. ఫలితంగా ప్రజలకు దక్కాల్సిన ప్రయోజనాలు తగ్గుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. పెట్టుబడిదారుల ద్వారా దేశాలు అభివృద్ధి చెందిపోతాయనే మాట అటు ఉంచితే వారు పెట్టే పెట్టుబడితో సంపద పెరిగి మానవ శ్రేయస్సు పెరిగిపోతుందని నేటి పాలకుల మాట వింటుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఎందుకంటే పెట్టు బడిదారులు లాభార్జన కోసం పోటీ పడుతుంటారు.. దీనికొసం అన్ని ఉత్పత్తులతో పాటు ఆయుధాల ఉత్పత్తి చేస్తుంటారు. అయితే ఈ ఉత్పత్తి ద్వారా ఒక దేశం మరొక దేశాన్ని అదుపు ఆజ్ఞలలో పెట్టుకుని అక్కడి వనరులను దోపిడీ చేసేందుకు చేస్తుంటాయి. ఈ విధానాలను ప్రభుత్వాలు కూడా అమలు చేయడం విచారకరం.



### యుద్ధాలను వారిస్తాను అంటూనే..

యుద్ధం పెట్టుబడిదారీ విధానం విభజించలేని కవల పిల్లలని మొదటి ప్రపంచ యుద్ధం నాడే లెనిన్ తెలియ జేశారు. పెట్టుబడిదారీ విధానం గుత్త పెట్టుబడిదారీ విధానం వైపు మళ్లేటప్పుడు సంపద కేంద్రీకరణ ఆదాయ అసమానతలు పెరిగి సామ్రాజ్యవాదంతో యుద్ధాలు తప్పని సరి. ప్రస్తుతం వివిధ దేశాలలో ఉన్న సహజ వనరులైన ఖనిజ సంపద, చమురు నిల్వలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం, ఆయుధాలను మార్కెట్ చేసుకోవడం కోసం ప్రపంచంలో యుద్ధాలు జరుగుతున్నాయి. కానీ మానవ శ్రేయస్సుకు ఏ మాత్రం కాదు. పెట్టుబడిదారుల పెద్దన్న అమెరికా అధ్యక్షులు యుద్ధాలు చేయబోను, యుద్ధాలను వారిస్తాను అంటూ మాదక ద్రవ్యాల సాకుతో అబద్ధపు ఆరోపణలతో వెనిజులా అధ్యక్షుడిని అపహరించారు. ఇరాన్ అణ్వస్త్రాలు తయారు చేస్తుందని సాకు చూపుతూ ఆ దేశ అధినేతను కుటుంబ సభ్యులతో సహా హత్య చేశారు.. నిజానికి ఇరాన్‌ను సామంత రాజ్యంగా మార్చి చమురు నిల్వలు కాజేయడం ట్రంప్ లక్ష్యం.

### నాయకత్వం వహించేవారు ఇలా ఉంటారా?

రెండో ప్రపంచ యుద్ధం ద్వారా అనేక దేశాలను నియంత్రించగలిగే శక్తి అమెరికాకు యూరోప్ దేశాలకు లభించడం వలన తద్వారా దేశాల అభివృద్ధి పథంలో ఉన్నాయి.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత గత 80 సంవత్సరాల్లో, అనేక దేశాలలో ప్రభుత్వాల మార్పునకు అమెరికా ప్రయత్నించింది. ఈ క్రమంలో సంభవించిన ఏ ఒక్క యుద్ధంలో కూడా అమెరికా గెలవలేదు.. ఊహకందనంత మారణహోమం తర్వాత కూడా అమెరికా తోక ముడుచుకుని పారిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వియత్నాం, అఫ్ఘానిస్తాన్‌లో అమెరికాకు ఎదురైన పరాజయాలే అందుకు ఉదాహరణలు.. తమ ఆధిపత్యాన్ని సవాల్ చేసిన ప్రతి ఒక్కరినీ నిర్దాక్షిణ్యంగా అంతమొందిస్తామని అనేక చర్యల ద్వారా ప్రపంచ దేశాలను అమెరికా హెచ్చరించింది. విచిత్రంగా స్వేచ్ఛా ప్రపంచంగా భావించే మిగతా దేశాలు ఈ అంశంలో మౌనంగా ఉన్నాయి. ప్రపంచ జీడీపీలో అమెరికాది 25 శాతం. చైనా, ఇండియాది కలిపి ప్రపంచ జీడీపీలో 25 శాతం. అందుకే గ్లోబల్ సౌత్‌కు నాయకత్వం వహించాలని మన ప్రధాని కోరుకుంటున్నారు. అయితే ముధురో దంపతుల అపహరణం గాని, వెనిజులాపై దాడిని కానీ, ఇరాన్‌పై దాడిని కానీ, కమీనే హత్యను గాని కనీసం పరోక్షంగా నైనా ఖండించే సాహసం చేయలేదు. చైనా మాత్రం ఇరాన్ అమెరికా యుద్ధంలో మధ్యవర్తిత్వానికి సిద్ధంగా ఉన్నావని చెబుతున్నది కానీ యుద్ధం ఆపే ప్రయత్నాలు చేయడం లేదు.

### ప్రత్యామ్నాయ మార్గాలు రూపొందించుకోవాలి!

పాలకులు పెట్టుబడిదారుల కనుసన్నల్లో ఉన్నప్పుడు, లేదా ట్రంప్ లాగా పాలకులే పెట్టుబడిదారులైనప్పుడు ప్రపంచ ప్రజలకు యుద్ధాల బెడద తప్పదు.. పెట్టుబడిదారీ వ్యవస్థ ఎప్పుడు లాభాల కోసం దోపిడీతో వివిధ కాలాలలో వివిధ దేశాలపై యుద్ధాలు చేస్తూనే ఉన్నది. ఇప్పుడు ప్రపంచ పెట్టుబడిదారులు పెద్దన్న అమెరికా పరిస్థితి అదే. సామ్రాజ్యవాదం పెట్టుబడిదారి వ్యవస్థ పతాక స్థాయి అని అందుకే లెనిన్ అన్నారు. ఇది పడిపోయే పతాకస్థాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఛాయలు ఉన్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనిశ్చితి పరిస్థితులను ఎదుర్కొంటోంది. గతకొన్ని సంవత్సరాలుగా ప్రపంచ వ్యాప్తంగా చోటుచేసుకుంటున్న యుద్ధాలు, ఇంధన ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల పెంపు వంటి పరిణామాలు ప్రపంచ ఆర్థిక స్థిరత్వాన్ని కుదిపేస్తున్నాయి.. ఈ పరిణామాల కారణంగా ప్రపంచ ఆర్థిక మాంద్యం వచ్చే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలపై ఈ పరిస్థితుల ప్రభావం మరింత తీవ్రంగా పడే అవకాశముంది. క్యాపి టలిజం ప్రజా శ్రేయస్సును పెంపొందించలేదు. అందుకే పాలకులు ప్రజా శ్రేయస్సు కోసం ప్రత్యామ్నాయ మార్గాలను రూపొందించుకోవాలి. లేకపోతే మానవ మనుగడకే ముప్పు.

# సంపాదకీయం

## మేల్కొన్న స్వప్నమే అమరావతి!

'ఒక రాష్ట్రానికి ఏ ప్రాంతం రాజధానిగా ఉండాలో నిర్ణయించే అధికారం ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది' అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ 2020 ఫిబ్రవరి 5న లోక్‌సభలో తెలుగుదేశం సభ్యుడు ఒకరు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 'రాజధాని నిర్ణయంలో మా పాత్ర ఏమీ లేదు' అని కేంద్ర హోంశాఖ అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లోనూ వివరించింది. సరిగ్గా ఆరేళ్ల తర్వాత చరిత్ర తనను తాను పునర్లిఖించుకున్నది. ఏ మంత్రి అయితే రాజధాని విషయంలో తమకు సంబంధం లేదని పార్లమెంటులో చెప్పారో, అదే మంత్రి (నిత్యానందరాయ్) ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి ఉంటుందని స్పష్టం చేస్తూ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ బిల్లును గత గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. రాజధాని విషయంలో తమకు ఎలాంటి ప్రమేయం లేదని ఒకప్పుడు అంటీముట్టనట్లుగా వ్యవహరించిన కేంద్రం, ఇప్పుడు అమరావతికి రాజధానిగా చట్టబద్ధత కల్పించేందుకు ఎందుకు అంగీకరించిందో అందరికీ తెలుసు. పన్నెండేళ్లుగా ఒక రాష్ట్రానికి రాజధాని అంటూ లేని దుస్థితి ఎందుకు ఏర్పడిందో కూడా అందరికీ తెలుసు. ఆంధ్రప్రదేశ్‌ను విభజిస్తూ 12 ఏళ్ల క్రితం పార్లమెంటు నిర్ణయం తీసుకున్నప్పుడు లోక్‌సభ, రాజ్యసభలో తీవ్ర గందరగోళం నెలకొన్న దృశ్యాలు ఇంకా ప్రజల మనఃఫలకం నుంచి చెరిగిపోలేదు. నాటి వాతావరణానికి పూర్తి భిన్నంగా ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ ప్రవేశపెట్టిన బిల్లుకు దాదాపు అన్ని పార్టీలు మద్దతు పలికాయి. ఒక్క వైసీపీ సభ్యులే ఉభయసభల నుంచి వాకౌట్ చేశారు. ఎందుకంటే తమ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అవలంబించిన వైఖరి వల్లే పార్లమెంటులో అమరావతి విషయమై బిల్లు ప్రవేశపెట్టాల్సిన అగత్యం ఏర్పడిందని వారికి తెలియనిది కాదు. 2024లో జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకుని తెలుగుదేశం పార్టీ ఎన్నికల బరిలోకి దిగినప్పుడు చాలామంది ఆశ్చర్యపోయారు. అసలు ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అవసరం ఉన్నదా అని పలువురు ప్రశ్నించారు. అయితే ఈ పొత్తు వల్ల ప్రయోజనం ఏమిటో అమరావతి బిల్లు ఆమోదం పొందిన రోజున వారికి అర్థమయ్యే ఉంటుంది. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు రెండోసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత, వైసీపీ పాలనలో ఆగిపోయిన అమరావతి పనులను పునరుద్ధరించేందుకు పూనుకున్నారు. కేంద్రం సహకారంతో ఏడీబీ, ప్రపంచ బ్యాంకు రుణం సాధించారు. ఇంకా అనేక బ్యాంకులు మౌలిక సదుపాయాలకు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. అయితే భవిష్యత్తులో అమరావతి రాజధానిగా కొనసాగుతుందన్న నమ్మకం ఏమిటి? అని కొందరు పారిశ్రామికవేత్తలు, వివిధ దేశాల రాయబారులు సందేహాలు వ్యక్తం చేశారు. ఆ సందేహాలను తొలగించేందుకే కేంద్రం సహాయ సహకారాలను చంద్రబాబు అర్థించారు. తెలుగుదేశం పార్టీ కీలక మిత్రపక్షంగా ఉన్న కారణంగా బీజేపీ అగ్రనేతలు ఈసారి ఆయనకు పూర్తి అండగా నిలిచారు. అమరావతికి చట్టబద్ధత కల్పించాల్సిందిగా చంద్రబాబు గత ఏడాది ప్రధానమంత్రి నరేంద్రమోదీని స్వయంగా అభ్యర్థించిన తర్వాత కేంద్రం అనేక ప్రశ్నలు సంధించింది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్, ఆర్థిక మంత్రిత్వ శాఖలోని వ్యయవిభాగంతో సహా అనేక మంత్రిత్వ శాఖలకు ఒక నోట్ పంపి, వాటి అభిప్రాయాన్ని స్వీకరించింది. చివరకు అటార్నీ జనరల్‌నూ సంప్రదించింది. కొత్త రాజధానిలో ప్రజలు సుఖవంతంగా జీవించేందుకు నిర్ణయించిన ప్రాతిపదిక ఏమిటి, వ్యాపారం సులభతరం అయ్యేందుకు చేపట్టిన చర్యలు ఏమిటి, అనుసరిస్తున్న అంతర్జాతీయ ఉత్తమ ప్రమాణాలు, పద్ధతులు ఏమిటి, శాంతి భద్రతల పరిస్థితి ఏమిటి... మొదలైన అంశాలపై ఆరా తీసింది. ఎన్నో తర్జనభర్జనలు, చర్చల తర్వాతే అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రం నిర్ణయించింది. పార్లమెంటు రెండో విడత బడ్జెట్ సమావేశాలు మరో వారంరోజుల్లో ముగుస్తాయనగా ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ తీర్మానం చేసి పంపిస్తే వెంటనే నిర్ణయం తీసుకుంటామని ప్రధానమంత్రి కార్యాలయం ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమాచారం పంపింది. రాష్ట్రంలో బీజేపీ తరఫున మంత్రిగా ఉన్న సత్యకుమార్ యాదవ్ ద్వారా ఈ సమాచారం పంపడం గమనార్హం. మోదీ తలుచుకుంటే కానిదేముంది? అసెంబ్లీ తీర్మానం చేసిన తర్వాత ఏపీ పునర్విభజన చట్ట సవరణ బిల్లును రాత్రికి రాత్రి నిర్ణయించి బడ్జెట్ సమావేశాల చివరి రెండు రోజుల్లో దానికి చట్ట రూపం కల్పించారు. చంద్రబాబు లాంటి దార్శనిక నేత ఇస్తున్న కీలక మద్దతు మూలంగానే ఇవాళ పార్లమెంటులో అసాధారణ రీతిలో అమరావతికి చట్టబద్ధత లభిస్తోందని జేడీ(యూ) నేత సంజయ్‌కుమార్ ఝూతో పాటు అనేక పార్టీల నాయకులూ ప్రకటించారు. ఏమైనా ఒక రాష్ట్ర రాజధానికి, అసాధారణ రీతిలో పార్లమెంటు, రాష్ట్రపతి ఆమోదం తర్వాత భారత ప్రభుత్వ గెజిట్‌లో స్థానం లభించడం ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యసాధకత్వానికి నిదర్శనం. ఇక రాజధానిగా అమరావతి ఉండాలా లేదా అన్న అంశంపై చర్చ లేవనెత్తడం, దాన్ని రాజకీయం చేయాలని చూడడం పూర్తిగా అనవసరం. నిజానికి గతంలో చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలను వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆ తర్వాత కేసీఆర్ కొనసాగించినట్లుగా జగన్ ప్రభుత్వం కూడా కొనసాగించి ఉంటే ఇప్పుడు ఈ చర్చ ఉండేదే కాదు. రాజధాని ఎలా ఉంటుంది, వేలాది ఎకరాల్లో ఎలా నిర్మిస్తారు, ఈ నిర్మాణం ఎంతకాలంలో పూర్తవుతుంది... అన్న ప్రశ్నలపై సందేహాలు ఉండడం సహజం. ఎన్నో యుద్ధాల్లో గాయపడి తేరుకుని మళ్లీ పోరాడి గెలిచిన వ్యక్తి చంద్రబాబు. ఆయనలో ఆత్మవిశ్వాసం, అనుభవం మెండుగా

## ఆహార భద్రతకు జనాభా సవాలు!



ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన 'ప్రపంచ జనాభా అంచనాల' నివేదిక ప్రకారం, ప్రపంచ జనసంఖ్య 2061 నాటికి వెయ్యి కోట్లు దాటుతుంది. అమెరికా సెన్సస్ బ్యూరో అంచనాలేమో, ఆ మైలురాయిని 2057లోనే చేరవచ్చంటున్నాయి. మరోవైపు కొందరు నిపుణులేమో ప్రపంచ జనాభా 2080వ దశకం మధ్యలో సుమారు 1030 కోట్ల దగ్గర గరిష్ఠ స్థాయికి చేరి, శతాబ్ది చివరినాటికి స్వల్పంగా తగ్గుతుందని అంటున్నారు. ఈ జనాభా ధోరణులు కేవలం గణాంకాలే కాదు, ప్రపంచ ఆహార వ్యవస్థపై పడే తీవ్రమైన ఒత్తిడికి సంకేతాలు కూడా! ప్రపంచ జనాభా పెరుగుదలతో పాటు వినియోగ అలవాట్లు మారడం, పశుగ్రాస అవసరాలు పెరగడం, నగరీకరణ వేగవంతం కావడం వల్ల ధాన్యాలకు డిమాండ్ బాగా పెరుగుతోంది. వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ అంచనాల ప్రకారం, 2050 నాటికి ప్రపంచ ఆహార డిమాండ్‌ను సమర్థంగా తీర్చాలంటే– ఆహారం, భూమి, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల మధ్యనున్న అంతరాలను ఏకకాలంలో తగ్గించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా లభ్యమవుతున్న ఆహారంలో దాదాపు 60శాతం వరి, గోధుమ, మొక్కజొన్న వంటి మూడు ప్రధాన పంటల నుంచే వస్తోంది. ఇది యావత్ ఆహార వ్యవస్థ పరిమిత పంటలపై ఎంతగా ఆధారపడి ఉందో తెలియజేస్తుంది. భవిష్యత్తులో ఆహార భద్రతను సాధించాలంటే వ్యవసాయోత్పత్తి పరిమాణాన్ని మాత్రమే కాకుండా– పంటల వైవిధ్యాన్ని, నిల్వ, రవాణా, వినియోగ సామర్థ్యం, వనరుల నిర్వహణను కూడా బలోపేతం చేసుకోవాలి. ఈ విషయంలో ఇండియా మరింత అప్రమత్తంగా వ్యవహరించక తప్పదు.

### ప్రమాదంలో భారతావని

భారతదేశంలో జనాభా వృద్ధిరేటు క్రమంగా తగ్గుతున్నప్పటికీ... 2054 నాటికి జనసంఖ్య 169 కోట్లకు చేరి, ఆ తరవాత కానీ స్వల్పంగా దిగిరాదన్న అంచనాలు ఉన్నాయి. ఈ శతాబ్దమంతా ఇండియా ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగానే కొనసాగుతుందని, శతాబ్దం మధ్యకాలంలో చైనా జనాభా సుమారు 131 కోట్లుగా ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి, భారత్‌లో జనాభాతో పాటే ఆహార ధాన్యాలకు డిమాండ్ కూడా నిరంతరం పెరుగుతూనే ఉంటుందని ప్రభుత్వాలు గుర్తుంచుకోవాలి. నేషనల్ అకాడెమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్(ఎన్ఏఏఎస్), భారత వ్యవసాయ పరిశోధన సంస్థ(ఐఏఆర్ఐ) అంచనాల ప్రకారం 2050 నాటికి దేశానికి సుమారు 40కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు అవసరపడతాయి. విత్తన అవసరాలు, పశుగ్రాస వినియోగం, నిల్వ నష్టాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే మొత్తం డిమాండ్ 2050 నాటికి 52.9 కోట్ల టన్నులకు, 2065 నాటికి 56.7 కోట్ల టన్నులకు చేరవచ్చని పలు పరిశోధనలు చెబుతున్నాయి. ప్రస్తుతం మన దేశంలో వార్షిక తలసరి ధాన్యం వినియోగం సుమారు 181–200 కిలోలు. ఈ శతాబ్దం మధ్యలో ఇది సుమారు 215 కిలోలకు పెరగవచ్చు. భారత్ 2024–25 పంట సంవత్సరంలో 35.77 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తిని సాధించింది. 2054 నాటి అవసరాలను తీర్చాలంటే, ఈ దిగుబడులు ఏటా నాలుగు శాతం చొప్పున పెరగాల్సిందే. ముఖ్యంగా వరి, గోధుమల ఉత్పాదకతలో పెరుగుదల సాధ్యపడాలి. సాగుభూమి పరిమితమవుతున్న పరిస్థితుల్లో కేవలం విస్తీర్ణం పెంచడం ద్వారా కాకుండా, అదే భూమిలో అధిక దిగుబడులనిచ్చే పంటల ద్వారానే అవసరమైన ఉత్పత్తిని సాధించాల్సి ఉంది.

ప్రస్తుత ఆహార వినియోగ ధోరణులను పరిగణనలోకి తీసుకుంటే, 2050 నాటికి గోధుమల డిమాండ్ 70–104 శాతం వరకు పెరగవచ్చు. ఇప్పుడు దేశీయంగా గోధుమల ఉత్పత్తి 12.02 కోట్ల టన్నులు. 2050 నాటికి దీన్ని కనీసం 14–16 కోట్ల టన్నులకు చేర్చాల్సి ఉంటుంది. వరి విషయంలో ప్రస్తుత 15.01 కోట్ల టన్నుల ఉత్పత్తిని 16–18 కోట్ల టన్నులకు పెంచడంపై దృష్టి పెట్టాలి. అయితే, వీటి ఉత్పాదకత పెంపు ఒక్కటే సరిపోదు. ఎందుకంటే, కొంతకాలంగా వాతావరణ మార్పులు వ్యవసాయాన్ని కొత్త ప్రమాదాలవైపు నెడుతున్నాయి. వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధనల ప్రకారం, మరో పాతికేళ్లలో పంటల సాగుకు అనువైన వాతావరణ మండలాలు ధ్రువాలవైపుగా మారే అవకాశముంది. దీనివల్ల అధిక అక్షాంశ ప్రాంతాలకు కొన్ని లాభాలు కలుగుతాయి. తక్కువ అక్షాంశ ప్రాంతాలు... ముఖ్యంగా ఉష్ణమండల, ఉపఉష్ణమండల దేశాలు అధికంగా నష్టాలపాలయ్యే ప్రమాదముంది. భారత్ వంటి దేశాల్లో గోధుమల దిగుబడి 19 శాతం, వరి దిగుబడి 20 శాతం మేర తగ్గిపోయే ప్రమాదముందని కొన్ని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. కాబట్టి, దీన్ని అధిగమించడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించక తప్పదు.

### పునరుత్పాదక సాగుకు...

వెయ్యి కోట్ల ప్రపంచ జనాభాకు ఆహారం అందించడమంటే కేవలం ఎక్కువ ధాన్యాలను పండించడమే కాదు; వ్యవసాయాన్నీ, భూ వినియోగాన్నీ, నీటి నిర్వహణనూ, పంటల ఎంపికనూ, ఉద్గారాల నియంత్రణనూ సమగ్రంగా పునర్‌వ్యవస్థీకరించడం. అడవులను నాశనం చేయకుండా ఉన్న భూమిలోనే అధిక దిగుబడులు సాధించడం, వృథాను తగ్గించడం, సరఫరా గొలుసులను సమర్థంగా తీర్చిదిద్దడం భవిష్యత్ ఆహార భద్రతకు మూలసూత్రాల వంటివి. కాబట్టి 'పునరుత్పాదక వ్యవసాయం' దిశగా పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. అందులో భాగంగా నేలలోని సేంద్రియ కర్బనాన్ని పునరుద్ధరించే విధంగా పంటలను సాగు చేయడం, పంటల వైవిధ్యాన్నీ జీవవైవిధ్యాన్నీ ప్రోత్సహించే పద్ధతులు పాటించడం కీలకం. ఇవి నేల ఆరోగ్యాన్ని కాపాడి, దీర్ఘకాలంలో ఉత్పాదకతను మెరుగుపరచగలవు. వాతావరణ మార్పులను సమర్థంగా ఎదుర్కొంటూ ఆహార భద్రతను సాధించాలంటే– వీటిని అనుబంధ చర్యలుగా కాకుండా, ప్రధాన వ్యూహాలుగా పరిగణించాలి. జనాభా పెరుగుదల, మారుతున్న వినియోగ ధోరణులు, వాతావరణ ఒత్తిళ్ల నడుమ సేద్యాన్ని మరింత స్థిరంగా, శాస్త్రీయంగా మార్చుకోవడంపై ప్రభుత్వాలు, వ్యవసాయ పరిశోధకులు, అన్నదాతలు దృష్టి సారించాలి. భారత్ వంటి దేశాలు ఈ సవాలును అవకాశంగా మలుచుకుంటే, తమ ప్రజలకే కాకుండా ప్రపంచ ఆహార భద్రతకూ గణనీయమైన తోడ్పాటు అందించగలుగుతాయి.

## ముంచుకొస్తున్న జనాభా సంక్షోభం.. ముందుగానే మేల్కొందాం!



ఒకప్పుడు 'జనాభా నియంత్రణ' లక్ష్యంగా సాగిన ప్రభుత్వ విధానాలు, ఇప్పుడు 'జనాభా నిర్వహణ' వైపు మళ్లాల్సిన అసాధారణ పరిస్థితి ఏర్పడింది. జపాన్, చైనా వంటి దేశాలు ఎదుర్కొంటున్న 'వృద్ధాప్య జనాభా' సంక్షోభం ఇప్పుడు తెలంగాణ గడప తడుతోంది. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు ప్రమాదకర స్థాయికి పడిపోతుండటం భవిష్యత్తు సామాజిక, ఆర్థిక భద్రతపై ఆందోళన కలిగిస్తోంది.

ఒక రాష్ట్ర జనాభా స్థిరంగా ఉండాలంటే సంతానోత్పత్తి రేటు 2.1 శాతం ఉండాలి. కానీ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం, తెలంగాణలో సంతానోత్పత్తి రేటు 1.7 శాతానికి పడిపోయింది. ప్రస్తుతం ఇది 1.5 శాతానికి చేరుకుందని అంచనా. అంటే, ప్రతి దంపతులు సగటున ఇద్దరు పిల్లలను కూడా కనడం లేదు. పట్టణ ప్రాంతాల్లో ఈ రేటు 1.8 శాతం ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 1.7 శాతంగా నమోదైంది. ఆశ్చర్యంగా గ్రామీణ ప్రాంతాల్లోనే రేటు కొంచెం తక్కువగా ఉండటాన్ని గమనించవచ్చు.

తగ్గుతున్న జననాల సంఖ్య!

2019 నుండి 2023 మధ్య కాలంలో తెలంగాణాలో నమోదైన జననాల సంఖ్యలో 22.4 శాతం తగ్గుదల కనిపించింది. దేశంలో యూపీ, బీహార్ లాంటి రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేటు పెరుగుతున్నా, తెలంగాణలో మాత్రం ఈ తగ్గుదల తీవ్రంగా ఉండటం ఒక 'రీజినల్ అవుట్ లయర్'గా నిపుణులు చెబుతున్నారు. జాతీయ సగటు సంతానోత్పత్తి రేటు సుమారు 2.0 శాతం ఉండగా, తెలంగాణలో అది 1. 6 నుండి 1.5 శాతానికి పడిపోయింది. 2035 నాటికి సంతానోత్పత్తి రేటు 1.5 శాతం వద్దే ఉండిపోయి, జనాభా వృద్ధి రేటు దాదాపు 'సున్నా'కి చేరుకుంటుందని అంచనా.

జనాభా పిరమిడ్ తలకిందులైతే..

సంతానోత్పత్తి రేటు ఇలాగే పడిపోతే.. భవిష్యత్తులో యువత సంఖ్య తగ్గి, వృద్ధుల సంఖ్య పెరిగి 'జనాభా పిరమిడ్' తలకిందులయ్యే ప్రమాదం ఉంది. దీనికి కారణం మహిళల్లో విద్య, ఉపాధి అవకాశాలు పెరగడం వల్ల ఆలస్యంగా వివాహాలు జరగడం. మారుతున్న జీవనశైలి, ఒత్తిడి వల్ల సంతానలేమి సమస్యలు ఎదురు కావడం. పిల్లల పెంపకం, నాణ్యమైన విద్య, కార్పొరేట్ వైద్యం సామాన్యుడికి భారంగా మారడం. దశాబ్దాలుగా జరిగిన కుటుంబ నియంత్రణ ప్రచారం వల్ల 'ఒక్కరు లేదా ఇద్దరు' అనే భావన ప్రజల్లో బలంగా నాటుకుపోవడం. ఫలితంగా సంతానోత్పత్తి రేటు క్రమంగా తగ్గుముఖం పట్టింది. ఏ దేశానికైనా యువతే జాతీయ సంపద. జనాభా పెరుగుదల, తగ్గుదల అంటే కేవలం కూడికలు, తీసివేతలు మాత్రమే కాదు.. జనాభా పెరిగినా, తగ్గినా ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులు అసాధారణంగా మారిపోతాయి. అందుకే జనాభా సమతుల్యత చాలా అవసరం.

దక్షిణాది మొత్తంలో జనాభా సంక్షోభం!

తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలోనూ సంతానోత్పత్తి రేటు వేగంగా పడిపోతుంది. అయితే, ఈ సంక్షోభాన్ని ముందే గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నివారణ చర్యలు చేపడుతోంది. దీని కోసం 'పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ' (జనాభా నిర్వహణ విధానం) ముందుకు తెస్తోంది. ఈ విధానం 2026 ఏప్రిల్ 1 నుండి అధికారికంగా అమల్లోకి రానుంది. దీని కోసం ఒక ప్రత్యేక పోర్టల్‌ను లేదా 'గ్రామ, వార్డు సచి వాలయ' వ్యవస్థను ఉపయోగించనుంది. 'మూడో బిడ్డను కంటే పాతిక వేలిస్తాం' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక ఆసక్తికర ప్రతిపాదన చేశారు.

జాతీయ సంక్షోభంగా జనాభా తగ్గుదల..

చైనా, జపాన్ దేశాల్లో జనాభా తగ్గుదల ఒక జాతీయ సంక్షోభంగా మారింది. ఈ సంక్షోభం నుంచి బయటప డేందుకు ఆయా దేశాలు అనేక ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు.. జపాన్ జనాభాలో 30% వృద్ధులే. యువత లేక పరిశ్రమలు మూతబడుతున్నాయి. రోబోలపై ఆధారపడాల్సిన స్థితి వచ్చింది. చైనాలో 'వన్ చైల్డ్ పాలసీ' వల్ల అక్కడ పని చేసేవారి సంఖ్య తగ్గిపోయింది. ఇప్పుడు 'ముగ్గురు పిల్లల' విధానాన్ని తెచ్చినా, పెరిగిన జీవన వ్యయం వల్ల దంపతులు పిల్లలను కనేందుకు ముందుకు రావడం లేదు. చైనాలో పిల్లల పెంపకం, ముఖ్యంగా విద్య, వైద్యం, గృహ నిర్మాణం అత్యంత ఖరీదైనవిగా మారాయి.. నగరాల్లో నివసించే వారు పిల్లలను కనేందుకు ఇది అతిపెద్ద అడ్డంకిగా మారింది. అటు జపాన్‌లోనూ నిలకడలేని జీతాలు, పెరుగుతున్న ఖర్చుల వల్ల యువత పెళ్లి, పిల్లలను కనేందుకు దూరంగా ఉంటున్నారు.


సంతానోత్పత్తి రేటు తగ్గితే యమ డేంజర్!

చైనా, జపాన్ దేశాల చూశాకనైనా మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కోవాలి. ముఖ్యంగా రాష్ట్రంలో విద్యా, వైద్యం, గృహ నిర్మాణం అత్యంత ఖరీదైనవిగా మారాయి. మెట్రో నగరం హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో నివసించే దంపతులు కనీసం ఇద్దరు పిల్లలను కూడా కనే సాహసం చేయడం లేదు.. దీంతో దంపతులు ఒకరు లేదా ఇద్దరికే పరిమితమైపోతున్నారు. సంతానోత్పత్తి రేటు తగ్గడం దేశ, రాష్ట్ర భవిష్యత్తు సామాజిక, ఆర్థిక పునాదులను ప్రభావితం చేసే విషయం. సంతానోత్పత్తి రేటు తగ్గుదలను అరికట్టాలంటే ఒక దీర్ఘకాలిక జనాభా వ్యూహాన్ని అమలు చేయడం అత్యవసరం. చైనా, జపాన్ తరహాలో అనేక ప్రోత్సాహకాలు ప్రవేశపెట్టి, నిబంధనలను కఠినంగా అమలు చేస్తే తప్ప, రాబోయే విపత్తు నుంచి బయటపడే మార్గం లేదు.

దంపతులకు ఆర్థిక భరోసా ఏది?

ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 'ఇద్దరు పిల్లల నిబంధన' ఎత్తివేయడం ప్రాథమిక అడుగు మాత్రమే. జనాభా పెరుగుదల అనేది కేవలం చట్టాలతో రాదు.. అది సామాజిక భద్రతతో ముడిపడి ఉంది. 'మేము పిల్లలను కంటే, వారి భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా ఉంటుంది' అనే నమ్మకం ప్రజల్లో కలిగించాలి. అందుకోసం పిల్లలను కనేందుకు ముందు కొచ్చిన దంపతులకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంలో ముందు చూపుతో వ్యవహరిస్తేనే, రాబోయే 'వృద్ధాప్య సంక్షోభం' నుండి రాష్ట్రాన్ని కాపాడుకోగలం.

## యుద్ధకాలంలో ఆశల అన్వేషణ



ప్రపంచంలో యుద్ధజ్వాలలు రగిలిన ప్రతిసారీ మనసులో ఒక ప్రశ్న తలెత్తుతుంది, ఇలాంటి సమయంలో మేధావులు, తత్వవేత్తలు ఏం చేస్తారని? రక్తపాతం, విధ్వంసాలతో నిండిన సమాజంలో తత్వశాస్త్ర ఆలోచనలకు నిజంగా స్థానముందా? వాళ్లు కూడా మనలాగే నిస్సహాయులై మౌనం వహించాల్సిందేనా? చరిత్రను పరిశీలిస్తే ఆసక్తికరమైన సత్యం కనిపిస్తుంది. గొప్ప ఆలోచనలెన్నో కల్లోల భరితమైన కాలాల్లోనే పుట్టాయి. యుద్ధం మనిషి జీవితాన్ని కుదిపేస్తుంది, అదే సమయంలో అది మనిషిని తన గురించి మరింత లోతుగా ఆలోచించడానికి ప్రేరేపిస్తుంది. విధ్వంసం మధ్యలో జీవితానికి అసలు అర్థం ఏంటి, మానవ విలువలను ఎందుకు నిలబెట్టుకోవాలనే ప్రశ్నలు అప్పుడు మరింత గట్టిగా వినిపిస్తాయి. ప్రపంచ యుద్ధాల సమయంలోనే జాన్ పాల్ సార్త్రే, సిమోన్ డి బోవాయిర్ వంటి తత్వవేత్తలు తమ రచనలను కొనసాగించారు. వారి ఆలోచనలు యుద్ధాన్ని వెంటనే ఆపలేకపోయినా, యుద్ధానంతర ప్రపంచం ఆలోచించాల్సిన దిశను చూపించాయి. నిరంకుశత్వం పుట్టుక గురించి హన్నా ఆరంట్ విశ్లేషణ కూడా అదే నేపథ్యంలోని అనుభవాల నుంచే వచ్చింది. ఒకసారి యుద్ధం కారణంగా దేశం విడిచి వచ్చిన తత్వశాస్త్ర ప్రొఫెసర్‌ను విద్యార్థి అడిగాడు– 'మీరు తత్వం చెప్పడం వల్ల యుద్ధం ఆగిపోతుందా?' అని. ఆయన నవ్వి 'యుద్ధం వెంటనే ఆగకపోవచ్చు. కానీ ఆగాక మనుషులు మళ్లీ ఆలోచించడం నేర్చుకోవాలి. ఆ వైపు నడిపించడమే నా పని' అని సమాధానమిచ్చారు. ఈ మాటలు ఒక ముఖ్యమైన సత్యాన్ని గుర్తుచేస్తాయి. తత్వవేత్తలు చరిత్రకు వైద్యుల్లాంటివారు. వారు గాయాన్ని వెంటనే నయం చేయలేరు. కానీ ఆ గాయం ఎలా ఏర్పడిందో అర్థం చేసుకోవడానికీ, మళ్లీ అదే తప్పు జరగకుండా చూడటానికీ మనకు సాయం చేస్తారు. యుద్ధం నుంచి తప్పించుకున్న ఒక కవి చెప్పిన మాట.. 'శిథిలాల మధ్య కూర్చుని ఒక చిన్న పువ్వు వికసించడం చూశాను, ఆ పువ్వు నాకు మళ్లీ కవిత్వం నేర్పింది.' జీవితం ఎప్పుడూ నశించదని, కొత్తగా మొలకెత్తడానికి అది ఎక్కడోచోట సరి కొత్త దారిని వెతుక్కుంటుందని ఆయన భావన. తత్వవేత్తలు కూడా ఆ పువ్వుల్లాంటివారే. విధ్వంసం మధ్యలో కూడా జీవితం కొనసాగుతుందని వారు మనకు ధైర్యం చెబుతారు. యుద్ధం మృత్యువు వైపు నడిపిస్తే, తత్వం మనల్ని జీవితం వైపు మళ్లిస్తుంది. మనిషి తనను తాను మరచిపోయినప్పుడే యుద్ధం మొదలవుతుందంటాడు మార్టిన్ హైడగ్గర్. ఆ మరపును తొలగించడం తత్వవేత్తల పని. యుద్ధం ఎందుకు? ఎవరికోసం? అని వాళ్లు వేసే ప్రశ్నలు అసౌకర్యాన్ని కలిగించవచ్చు. కానీ అదే అసౌకర్యం మనల్ని మనుషులుగా నిలబెడుతుంది. యుద్ధం ప్రశ్నలను చంపుతుంది, తత్వం వాటిని బతికిస్తుంది. యుద్ధాలు రావచ్చు, పోవచ్చు. కానీ తత్వం ఎప్పటికీ ఉంటుంది. ఎందుకంటే అది కేవలం ఆలోచన కాదు, మనిషి అంతరాత్మలో వినిపించే శాశ్వత స్వరం. యుద్ధగర్జనల మధ్యలో కూడా ఆ స్వరం మెల్లగా వినిపిస్తూనే ఉంటుంది. దాన్ని వినాలంటే మనం కాసేపు ఆగాలి, ఆలోచించాలి, మనలోని మనిషిని తట్టిలేపాలి.

## తగ్గిన కాల్పుల మోత.. మొదలైన కాసుల కోత.. హార్ముజ్ జలసంధి వద్ద కొత్త పంచాయతీ..!




మధ్యప్రాచ్యంలో కాల్పుల మోత తగ్గింది. కానీ కాసుల కోత మొదలైంది. హార్ముజ్‌ను ఓపెన్ చేస్తాం.. కానీ కండిషన్స్ అప్లై అంటోంది ఇరాన్. ఇన్నాళ్లూ టోల్ ఫ్రీగా ఉండే హార్ముజ్ జలసంధి.. ఇప్పుడు టోల్‌ఫీ జోన్‌లోకి చేర్చింది టెహ్రాన్. ఇందుకు సంబంధించిన బిల్లును ఇప్పటికే ఇరాన్ పార్లమెంట్ ఆమోదించింది. అంటే ఇప్పటి నుంచి ఏ షిప్ అయినా హార్ముజ్ నుంచి బయటకు రావాలంటే టోల్ కట్టి బయటకు రావాలి. మధ్యప్రాచ్యంలో కాల్పుల మోత తగ్గింది. కానీ కాసుల కోత మొదలైంది. హార్ముజ్‌ను ఓపెన్ చేస్తాం.. కానీ కండిషన్స్ అప్లై అంటోంది ఇరాన్. ఇన్నాళ్లూ టోల్ ఫ్రీగా ఉండే హార్ముజ్ జలసంధి.. ఇప్పుడు టోల్‌ఫీ జోన్‌లోకి చేర్చింది టెహ్రాన్. ఇందుకు సంబంధించిన బిల్లును ఇప్పటికే ఇరాన్ పార్లమెంట్ ఆమోదించింది. అంటే ఇప్పటి నుంచి ఏ షిప్ అయినా హార్ముజ్ నుంచి బయటకు రావాలంటే టోల్ కట్టి బయటకు రావాలి. అయితే అంతర్జాతీయ జలాల ఒప్పందం ప్రకారం హార్ముజ్ జలసంధి నుంచి రవాణా చేసే ఏ నౌకలైనా టోల్ ఫీలు చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ యుద్ధం నేపథ్యంలో కొత్త రూల్ పెట్టింది ఇరాన్ రాత్రి బెదిరింపులు, తెల్లారాక దేబిరింపులు అన్నట్టుగా ఉంది అమెరికా తీరు. ప్రపంచ పటంలో ఇరాన్ ఉండదంటూ నిన్న రాత్రి గర్జించిన ట్రంప్..ఇప్పుడు శాంతి ఒప్పందం పేరుతో రెండు వారాలు సీజ్ ఫైర్ ప్రకటించారు. బాగానే ఉంది కానీ, ఇజ్రాయెల్, అమెరికా యుద్ధ వైఫల్యానికి ఇప్పుడు ప్రపంచం మూల్యం చెల్లించుకోవాలా అంటూ అంతర్జాతీయ సమాజం ఆగ్రహిస్తోంది. అయితే ప్రపంచ దేశాల అభ్యంతరాలను ఇరాన్ ఏమాత్రం పట్టించుకోవడంలేదు. టోల్ ఫీ ఎంతన్నది ఇంకా నిర్ధారణ కాలేదు కానీ, ఫీ వసూలు చేసేందుకు మాత్రం సిద్ధమైంది. దేశ ఫ్లాగ్‌ను బట్టి, నౌక రకం, అది తీసుకెళ్తున్న సరుకు, ఓడ రిజిస్ట్రేషన్ చేయించుకున్న దేశాన్ని బట్టి టోల్ ఫీ ఉండేలా చార్జ్ చార్ట్‌ను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. యుద్ధ సమయంలో ఇరాన్ కొన్ని నౌకలపై సుంకాలు విధించింది. కానీ అవి ఏ దేశాలకు చెందినవో, వాటి సంఖ్య ఎంత, ఎంత మొత్తం వసూలు చేశారనేది స్పష్టంగా లేదు. కొన్ని కథనాల ప్రకారం ఈ సుంకం 10-15 మిలియన్ డాలర్లుగా ఉంది. అయితే, ఇరాన్‌కు సుంకాలు విధించే హక్కు ఇస్తే, ఒక్కో నౌకపై సుంకం 2 మిలియన్ డాలర్లు ఉండవచ్చని పలు నివేదికలు సూచిస్తున్నాయి. అంతేకాకుండా, నౌక రకం, సరుకు, మరియు అప్పటి పరిస్థితులను బట్టి సుంకాలు మారవచ్చు. ఈ రుసుములు ప్రపంచ చమురు ధరల పెరుగుదలకు, అంతర్జాతీయ సముద్ర రవాణా నిబంధనలలో శాశ్వత మార్పులకు దారితీయవచ్చని విశ్లేషకులు హెచ్చరించారు. ఇరాన్-ఇరాక్ జాయింట్ ఫ్రంట్ ప్రకారం, హార్ముజ్ జలసంధిపై సుంకాలు విధిస్తే, ఇరాన్ ఏటా 70-80 బిలియన్ డాలర్లు సంపాదించగలదు. ఈ మొత్తంలో ఒమన్ వాటా ఎంత అనేది ప్రస్తుతం తెలియదు. ఇతర అంచనాల ప్రకారం ఈ సుంకాలు సంవత్సరానికి 100 బిలియన్ డాలర్ల వరకు ఉండవచ్చు. సూయజ్ కాలువపై సుంకాల ద్వారా ఈజిప్ట్ నెలకు 700 నుండి 800 మిలియన్ డాలర్లు సంపాదిస్తుంది. ఇరాన్ కూడా అదే విధంగా ప్రయోజనం పొందుతుందని కొందరు నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, టోల్ ఫీజును అమెరికా, అరబ్ దేశాలు వ్యతిరేకిస్తున్నాయి. అంతర్జాతీయ రూల్స్ ప్రకారం టోల్ వసూలు చేయడం ఇల్లీగల్ అంటున్నాయి.

## మెట్రో నగరాల్లో ఆకాశాన్ని తాకుతున్న ఇళ్ల ధరలు! ఇక టైర్-2, టైర్-3 నగరాలే దిక్కు!



మెట్రో నగరాల్లో అస్తి ధరల పెరుగుదల గృహ కొనుగోలును కష్టతరం చేస్తోంది. దీనితో పెట్టుబడిదారులు, పదవీ విరమణ చేసినవారు తక్కువ ఖర్చుతో కూడిన మెరుగైన జీవన నాణ్యత కోసం టైర్-2, టైర్-3 నగరాల వైపు మళ్లుతున్నారు. ఇండోర్, మైసూర్, విశాఖపట్నం వంటి నగరాలు తక్కువ జీవన వ్యయం, కాలుష్య రహిత వాతావరణం, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి ప్రయోజనాలను అందిస్తున్నాయి. దేశంలోని ప్రధాన మెట్రో నగరాలు అయిన ఢిల్లీ, ముంబై, బెంగళూరులలో అస్తి ధరలు అమాంతం పెరగడంతో గృహ కొనుగోలు చాలా మందికి అందుబాటులో లేకుండా పోతోంది. ముఖ్యంగా మధ్యతరగతి పై వర్గానికి కూడా ఇల్లు కొనడం కష్టతరమవుతోంది. ఈ పరిస్థితుల్లో పెట్టుబడిదారులు, పదవీ విరమణ చేసినవారు తక్కువ ఖర్చుతో మెరుగైన జీవన నాణ్యత అందించే చిన్న నగరాల వైపు దృష్టి సారిస్తున్నారు. మెట్రో నగరాల్లో పెరుగుతున్న జీవన వ్యయాలు, ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం వంటి సమస్యలు రోజువారీ జీవితాన్ని కష్టతరం చేస్తున్నాయి. ఒకప్పుడు ఉద్యోగ అవకాశాలు, ఆర్థిక స్థిరత్వం కోసం ప్రధాన గమ్యస్థానాలుగా ఉన్న ఈ నగరాలు ఇప్పుడు చాలా మందికి ఆకర్షణ కోల్పోతున్నాయి. ముఖ్యంగా పదవీ విరమణ తర్వాత ప్రశాంతమైన వాతావరణం కోసం ప్రజలు ఇతర ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇండోర్, చండీఘర్, డెహ్రాడూన్, మైసూర్, భువనేశ్వర్, వారణాసి వంటి టైర్-2 నగరాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న గమ్యస్థానాలుగా ఎదుగుతున్నాయి. ఇవి తక్కువ జీవన వ్యయం, పరిశుభ్రమైన వాతావరణం, నెమ్మదైన జీవనశైలి వంటి ప్రయోజనాలను అందిస్తుండటంతో గృహ కొనుగోలుదారులు, పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నాయి. ఇక టైర్-3 నగరాలైన విశాఖపట్నం, రాయ్‌పూర్, ఉదయ్‌పూర్ వంటి ప్రాంతాలు కూడా భవిష్యత్ వృద్ధి కేంద్రాలుగా గుర్తింపు పొందుతున్నాయి. తక్కువ పెట్టుబడితో మంచి రాబడి అవకాశాలు ఉండటం, మౌలిక సదుపాయాల వేగవంతమైన అభివృద్ధి ఈ నగరాల ప్రాధాన్యతను పెంచుతున్నాయి. మెట్రో నగరాల్లో ఒక 3బీహెచ్‌కె ఫ్లాట్ ధర కోటి రూపాయలకుపైగా ఉండగా, టైర్-2, టైర్-3 నగరాల్లో ఇదే అస్తి 30 లక్షల నుంచి 1.5 కోట్ల మధ్య లభిస్తోంది. అదనంగా ఎక్స్‌ప్రెస్‌వేలు, విమానాశ్రయాలు, స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల వంటి మౌలిక సదుపాయాల విస్తరణ చిన్న నగరాలను మరింత అందుబాటులోకి తెస్తోంది. మొత్తంగా మెట్రో నగరాలపై ఆధారపడిన రియల్ ఎస్టేట్ ధోరణి క్రమంగా మారుతోంది. అందుబాటు ధర, జీవన నాణ్యత, భవిష్యత్ వృద్ధి అవకాశాల కారణంగా చిన్న నగరాలు ఇప్పుడు పెట్టుబడిదారులకు, పదవీ విరమణ చేసిన వారికి ప్రధాన ప్రత్యామ్నాయాలుగా మారుతున్నాయి.

## 2 BHK కొంటే లాభమా? 3 BHK బెటరా? పెట్టుబడి పెట్టే ముందు ఈ లెక్క చూడండి!




సొంత ఇల్లు అనేది ఒక భావోద్వేగం మాత్రమే కాదు.. అది జీవితకాల పెట్టుబడి కూడా. అయితే ఇల్లు కొనే సమయంలో చాలామంది ఎదుర్కొనే అతిపెద్ద సందిగ్ధం 2 బీహెచ్‌కే తీసుకోవాలా లేక 3 బీహెచ్‌కే తీసుకోవాలా అని. తక్కువ ధరలో వస్తుంది కదా అని 2 బీహెచ్‌కే వైపు మొగ్గు చూపాలా? లేక భవిష్యత్తు అవసరాల కోసం 3 బీహెచ్‌కే ఎంచుకోవాలా? ఏది మీకు అత్యధిక లాభాన్ని తెచ్చిపెడుతుందో ఇప్పుడు అసలైన లెక్కలతో తెలుసుకుందాం. ప్రతి ఒక్కరి జీవితంలో సొంత ఇల్లు ఒక మైలురాయి. ఆర్థిక స్థిరత్వం లభించిన తర్వాత ఇల్లు కొనే -విషయంలో చేసే చిన్న పొరపాటు భవిష్యత్తులో పెద్ద నష్టానికి దారితీయవచ్చు. కేవలం ప్రస్తుత అవసరాలనే కాకుండా, రాబోయే 10-20 ఏళ్ల అవసరాలను, రీసేల్ వాల్యూను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలి. 2 బీహెచ్‌కే, 3 బీహెచ్‌కే ఇళ్ల మధ్య ఉన్న లాభనష్టాల విశ్లేషణ మీకోసం.

**2 బీహెచ్‌కే ఇల్లు: ఎవరికి ఉత్తమమైనది?**

బడ్జెట్ ఫ్రెండ్లీ: తక్కువ ధర, తక్కువ రిజిస్ట్రేషన్ ఫీజులు మరియు తక్కువ నిర్వహణ ఖర్చులు దీని ప్రధాన బలం.

అద్దె ఆదాయం: నగరాల్లో చిన్న కుటుంబాలు, ఉద్యోగుల సంఖ్య ఎక్కువ కాబట్టి 2 బీహెచ్‌కే ఇళ్లకు అద్దెదారులు త్వరగా దొరుకుతారు.

తక్కువ పెట్టుబడి: మీరు మొదటిసారి ఇల్లు కొంటుంటే లేదా కేవలం పెట్టుబడి పెట్టి అద్దె సంపాదించాలనుకుంటే ఇది మంచి ఎంపిక.

3 బీహెచ్‌కే ఇల్లు: ఎందుకు దీర్ఘకాలిక లాభం?

అధిక రీసేల్ వాల్యూ: అస్తి విలువ పెరిగినప్పుడు, 2 బీహెచ్‌కే కంటే 3 బీహెచ్‌కే ఇళ్ల ధరలు వేగంగా పెరుగుతాయి. తిరిగి అమ్మేటప్పుడు భారీ లాభం వస్తుంది.

భవిష్యత్తు అవసరాలు: పిల్లలు పెద్దయ్యాక లేదా వృద్ధ తల్లిదండ్రులు మీతో ఉండాల్సి వచ్చినప్పుడు 3 బీహెచ్‌కే స్థల కొరతను తగ్గిస్తుంది. పదేపదే ఇల్లు మారే తలనొప్పి ఉండదు.

వర్క్ ఫ్రమ్ హోమ్: నేటి కాలంలో ఒక గదిని ఆఫీస్ స్పేస్‌గా మార్చుకోవడానికి 3 బీహెచ్‌కే ఎంతో అనుకూలం. ఐటీ రంగంలోని వారు ఇప్పుడు ఇలాంటి విశాలమైన ఇళ్లనే కోరుకుంటున్నారు.

గోప్యత (Privacy): అతిథులు వచ్చినప్పుడు లేదా సొంతంగా పని చేసుకోవాలనుకున్నప్పుడు అదనపు గది మీకు మరింత సౌకర్యాన్ని ఇస్తుంది.

మీకు బడ్జెట్ పరిమితులు ఉండి తక్షణ అద్దె ఆదాయమే లక్ష్యం అయితే 2 బీహెచ్‌కే ఎంచుకోండి. కానీ, మీకు ఆర్థిక స్తోమత ఉండి, భవిష్యత్తులో అత్యధిక లాభం మరియు స్థిరత్వం కావాలనుకుంటే 3 బీహెచ్‌కే కొనుగోలు చేయడం అత్యంత తెలివైన నిర్ణయం. ఇది కేవలం సమాచారం మాత్రమే. సంస్థ దీనికి బాధ్యత వహించదు. ఇంటి కొనుగోలు నిర్ణయం తీసుకునే ముందు స్థలం విలువ, చుట్టుపక్కల అభివృద్ధి మరియు మీ వ్యక్తిగత ఆర్థిక స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించండి.

## దుమ్మురేపిన స్టాక్.. ఒకే రోజు రూ.2,300 పెరిగిన షేరు ధర.. ఇన్వెస్టర్లకు లాభాల పంట!

దేశీయ స్టాక్ మార్కెట్లలో బుధవారం ఉత్సాహం ఉరకలెత్తింది. అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ప్రకటనతో దలాల్ స్ట్రీట్ భారీ లాభాల బాట పట్టింది. రెండు వారాల పాటు సైనిక దాడులు ఆపేందుకు అమెరికా, ఇరాన్ అంగీకరించాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లలో భయాలు.. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధ మేఘాలు ప్రస్తుతానికి తొలగిపోవడంతో భారత స్టాక్ మార్కెట్లు రాకెట్‌లా దూసుకెళ్లాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన శాంతి ప్రకటన మార్కెట్లలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సానుకూల పవనాలతో సెన్సెక్స్, నిఫ్టీలు రికార్డు స్థాయి లాభాలను మూటగట్టుకున్నాయి. ఏప్రిల్ 8 సెన్సెక్స్ 2,946 పాయింట్లు పెరిగి 77,563 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ 873 పాయింట్లు (3.78%) ఎగబాకి 23,997 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ ఒక్కరోజులోనే రూ.16 లక్షల కోట్ల సంపద పెరిగింది.



**ఫోర్స్ మోటార్స్ (Force Motors) ప్రభంజనం:**


మార్కెట్ జోష్‌కు తోడు అద్భుతమైన అమ్మకాల గణాంకాలతో ఆటోమొబైల్ దిగ్గజం ఫోర్స్ మోటార్స్ షేరు దుమ్మురేపింది. ఒక్కరోజే ఈ షేరు ధర ఇన్వెస్టర్లకు కళ్లు చెదిరే లాభాలను అందించింది. ప్రారంభ ధర: క్రితం ముగింపు రూ.19,920 కాగా, బుధవారం ఏకంగా రూ. 20,900 వద్ద ఓపెన్ అయింది. గరిష్ట స్థాయి: ఇంట్రాడేలో 12% పెరిగి రూ. 22,290 మార్కును తాకింది. ఇక ముగింపు: చివరికి 11.10% లాభంతో రూ. 22,131 వద్ద స్థిరపడింది. నికర లాభం: ఒక్కో షేరుపై ఒకే రోజు దాదాపు రూ. 2,211 నుంచి రూ. 2,350 వరకు పెరగడం విశేషం.

**ఎందుకీ దూకుడు?**

ఫోర్స్ మోటార్స్ షేరు ఇంతలా పెరగడానికి ప్రధాన కారణం కంపెనీ సాధించిన అమ్మకాల వృద్ధి. సేల్స్ గ్రోత్ 2025-26 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ దేశీయంగా 36,536 యూనిట్లను విక్రయించింది. వార్షిక వృద్ధి గత ఏడాదితో పోలిస్తే అమ్మకాలు 20 శాతం మేర పెరగడం ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంచింది. మార్కెట్ సెంటిమెంట్ యుద్ధ భయాలు తొలగి, చమురు సరఫరా పునరుద్ధరణపై ట్రంప్ హామీ ఇవ్వడం ఆటో రంగానికి బూస్ట్‌నిచ్చింది. ఫోర్స్ మోటార్స్ 52 వారాల గరిష్ట ధర రూ. 26,450 కాగా, కనిష్ట ధర రూ. 8,300. ప్రస్తుతం ఈ సంస్థ మార్కెట్ విలువ రూ. 29.10 వేల కోట్లుగా ఉంది. ఇన్వెస్టర్లకు ముఖ్య గమనిక ఏంటంటే.. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. పెట్టుబడి పెట్టే ముందు నిపుణులను సంప్రదించడం శ్రేయస్కరం.

## 18 క్యారెట్ల బంగారు ఉంగరం చేయించుకోవాలా? మేకింగ్ ఛార్జీలు, GSTతో కలిపి మొత్తం ఖర్చు ఎంతవుతుంది?





18 క్యారెట్ల బంగారు ఉంగరం చేయించుకోవాలా? మేకింగ్ ఛార్జీలు, GSTతో కలిపి మొత్తం ఖర్చు ఎంతవుతుందో మీకు తెలుసా? బిల్లు వేసే సమయంలో మేకింగ్ ఛార్జీలపై జ్యువెలర్‌తో బేరమాడే అవకాశం ఉంటుంది. దీనివల్ల మీరు కొంత మేర ఖర్చు తగ్గించుకోవచ్చు. మీరు నగలు.. బంగారం ధరలు మార్కెట్‌లో ఎంత హెచ్చుతగ్గులకు లోనైనప్పటికీ, బంగారు ఆభరణాల పట్ల మనకున్న మక్కువ ఎప్పటికీ తగ్గదు. మీరు కూడా ఈ రోజుల్లో 18 క్యారెట్ల (18k) బంగారు ఉంగరాన్ని చేయించుకోవాలని ఆలోచిస్తున్నట్లయితే, జ్యువెలరీ షాపుకు వెళ్లేముందు దాని ధర ఎలా లెక్కిస్తారో తెలుసుకోవడం చాలా ముఖ్యం. కేవలం బంగారం ధర మాత్రమే కాకుండా, దానిపై విధించే మేకింగ్ ఛార్జీలు (తయారీ ఖర్చులు), +జీ కూడా మీ బడ్జెట్‌పై ప్రభావం చూపుతాయి. 18 క్యారెట్ల ఉంగరం చేయించుకోవడానికి అసలు ఎంత ఖర్చవుతుందో చేసుకుందాం.

**బంగారం ధర, బరువు:**

ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం.. 18 క్యారెట్ల బంగారం ధర గ్రాముకు సుమారు రూ.11,328 నుండి రూ.11,335 మధ్యలో ఉంది. బంగారం ధరలో వచ్చే స్వల్ప మార్పు కూడా మీ బిల్లుపై ప్రభావం చూపుతుందని గుర్తించుకోండి. మీ ఉంగరం ప్రాథమిక ధర దాని బరువు, ఆ రోజు మార్కెట్ రేటుపై ఆధారపడి ఉంటుంది. మహిళలకు శుభవార్త.. ఏకంగా రూ.50 వేలు తగ్గిన వెండి ధర..! ఉదాహరణకు: మీరు 4 గ్రాముల బరువున్న ఒక సాధారణ ఉంగరాన్ని చేయించుకోవాలనుకుంటే, గ్రాముకు రూ.11,330 చొప్పున కేవలం బంగారం ధర మాత్రమే సుమారు రూ.45,320 అవుతుంది. ఇందులో ఇంకా ఎలాంటి ఇతర ఛార్జీలు కలపలేదు.

మేకింగ్ ఛార్జీలు (Making Charges):

బంగారం అసలు ధర నిర్ణయించిన తర్వాత జ్యువెలర్లు దానిపై మేకింగ్ ఛార్జీలను విధిస్తారు. సాధారణంగా ఇవి 5% నుండి 15% వరకు ఉంటాయి. మీరు ఒక సాధారణ డిజైన్‌ను ఎంచుకుని, దానికి 10% మేకింగ్ ఛార్జీలు అనుకుంటే, మీ బిల్లుకు అదనంగా రూ.4,500 జత చేయబడుతుంది. ఒకవేళ డిజైన్ చాలా క్లిష్టంగా లేదా స్పెషల్‌గా ఉంటే ఈ శాతం ఇంకా పెరగొచ్చు.

**GST, ట్యాక్స్:**

బంగారం ధర, మేకింగ్ ఛార్జీల మొత్తంపై 3% +జీ వసూలు చేస్తారు. పైన పేర్కొన్న లెక్క ప్రకారం, దాదాపు రూ.1,400 నుండి రూ.1,500 వరకు ట్యాక్స్ రూపంలో అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

**మొత్తం ఖర్చు ఎంత అవుతుంది?**

ఈ లెక్కలన్నింటినీ కలిపితే 4 గ్రాముల బరువున్న 18 క్యారెట్ల సాధారణ బంగారు ఉంగరం మీకు సుమారు రూ.53,000 నుండి రూ.56,000 మధ్యలో పడుతుంది.

**వినియోగదారులకు ముఖ్య గమనిక:**

**HUID హాల్ మార్క్:** మీరు బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేటప్పుడు దాని నాణ్యతను నిర్ధారించుకోవడానికి ఎల్లప్పుడూ HUID హాల్ మార్క్ ఉన్న నగలను మాత్రమే ఎంచుకోండి. దీని కోసం కొంచెం ఎక్కువ చెల్లించాల్సి వచ్చినా భవిష్యత్తులో అది మీకు భరోసా ఇస్తుంది.

**బేరసారాలు:** బిల్లు వేసే సమయంలో మేకింగ్ ఛార్జీలపై జ్యువెలర్‌తో బేరమాడే అవకాశం ఉంటుంది. దీనివల్ల మీరు కొంత మేర ఖర్చు తగ్గించుకోవచ్చు. మీరు నగలు కొనేముందు ఈ లెక్కలను గుర్తుంచుకుంటే, మోసపోకుండా సరైన ధరకే బంగారాన్ని కొనుగోలు చేయవచ్చు.

## ఆధార్ కార్డులోని పేరు, డేట్ ఆఫ్ బర్త్ ఎన్నిసార్లు మార్చుకోవచ్చు..? కేంద్రం కొత్త కండీషన్స్..

ఆధార్ కార్డు ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిఒక్కరికీ అవసరమైన డాక్యుమెంట్. ఇందులో వివరాలు కరెక్ట్‌గా ఉండేలా చూసుకోవడం చాలా ముఖ్యం. వివరాలు తప్పుగా ఉంటే అనేక అవాంతరాలు ఎదురవుతాయి. అయితే ఆధార్‌లోని వివరాలను మార్చుకునే అవకాశం యూఐడీఏఐ కల్పిస్తోంది. కానీ కొన్ని పరిమితులు విధించింది. ఆధార్ కార్డు తీసుకున్నప్పుడు మీ డీటెయిల్స్‌లో తప్పుడు వివరాలు నమోదైతే వాటిని మార్చుకోవాల్సి ఉంటుంది. లేకపోతే కేవైసీ ధృవీకరణ ప్రక్రియలో మీరు ఇబ్బందులు పడవచ్చు. ఒక్కో ధృవీకరణ పత్రంలో ఒక్కోరకంగా వివరాలు ఉండటం సమస్యలు ఎదురవుతాయి. ఇప్పట్లో ప్రతీ పనికి ఆధార్ అనేది తప్పనిసరి అయింది. దీంతో ఆధార్‌లోని వివరాలను మార్చుకోవడం వల్ల మీకు ఎలాంటి సమస్యలు భవిష్యత్తులో ఉండవు. అయితే ఆధార్ కార్డులో వివరాలను అప్డేట్ చేసుకునేందుకు యూఐడీఏఐ కొన్ని పరిమితులు విధించింది. వాటి వివరాలేంటో ఇప్పుడు చూద్దాం.

**పేరు, డేట్ ఆఫ్ బర్త్ ఎన్నిసార్లు..?**




ఆధార్ కార్డుల్లోని పేరు, డేట్ ఆఫ్ బర్త్‌కు సంబంధించి యూఐడీఏఐ కొన్ని కండీషన్స్ పెట్టింది. వాటిని మార్చుకునేందుకు కొన్ని పరిమితులు పెట్టింది. అంటే మీరు ఎన్నిసార్లు కావాలంటే అన్ని సార్లు మార్చుకోవడానికి కుదరదు. పేరు కేవలం రెండుసార్లు మాత్రమే మార్చుకోవచ్చు. ఇక డేట్ ఆఫ్ బర్త్ అయితే కేవలం ఒకసారి మాత్రమే అప్డేట్ చేసుకోవచ్చు. ఈ మేరకు యూఐడీఏఐ కొన్ని నిబంధనలను రూపొందించింది.

**నిబంధనలు ఇవే..**

పేరును జీవితకాలంలో రెండుసార్లు మాత్రమే మార్చుకోవచ్చు
డేట్ ఆఫ్ బర్త్ ఒక్కసారి మాత్రమే ఛేంజ్ చేసుకునే వెసులుబాటు ఉంది
లింగాన్ని ఒక్కసారి మాత్రమే అప్డేట్ చేసుకోవచ్చు
అడ్రస్ ఎన్నిసార్లు అయినా మార్చుకోవచ్చు. ఇందుకు ఎలాంటి పరిమితులు విధించలేదు

**పరిమితులు దాటిన తర్వాత..**

ఇక పరిమితులు దాటిన తర్వాత ఏదైనా పొరపాట్లు ఉండి వివరాలు మార్చుకోవాలంటే ఆధార్ రీజినల్ ఆఫీస్‌ను సంప్రదించాలి. అక్కడి అధికారులకు వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. అధికారులు పరిశీలించాక అనుమతి జారీ చేస్తారు. ఇక ఆధార్‌లో మార్పులు చేయాలంటే అందుకు అవసరమైన ప్రూఫ్ సమర్పించాల్సి ఉంటుంది. ఇక మెయిల్ ద్వారా కూడా మీరు యూఐడీఏఐ అధికారులను సంప్రదించవచ్చు. అందుకే ఆధార్ కార్డులోని వివరాలు మార్చుకునేముందే కరెక్ట్‌గా ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవడమే మంచిది.

## ఎప్పుడంటే అప్పుడు పడుకునే అలవాటు ఉందా అయితే ఈ ప్రమాదం పొంచి ఉందని గుర్తుంచుకోండి



ప్రతిరోజూ వేర్వేరు సమయాల్లో నిద్రపోవడం వల్ల శరీరంలోని అంతర్గత గడియారం దెబ్బతింటుంది. దీని ప్రభావం నేరుగా మన గుండె పనితీరుపై పడుతుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ముఖ్యంగా మధ్యవయసులో ఉన్నవారికి ఈ ముప్పు పొంచి ఉందని, భవిష్యత్తులో వారు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఈ అధ్యయనం స్పష్టం చేస్తోంది.

ఆధునిక జీవనశైలిలో పని ఒత్తిడి, సామాజిక మాధ్యమాల ప్రభావం వల్ల చాలామంది నిద్రపోయే సమయాలను నిర్లక్ష్యం చేస్తుంటారు. ఒకరోజు త్వరగా పడుకుంటే, మరోరోజు అర్ధరాత్రి వరకు మేల్కొనడం అలవాటుగా మారింది. అయితే ఈ అలవాటు కేవలం అలసటకే కాదు, ప్రాణాంతకమైన గుండె జబ్బులకు కూడా దారితీస్తుందని తాజా పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి.

పరిశోధనలో వెల్లడైన షాకింగ్ నిజాలు

ఫిన్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ఓలు పరిశోధకులు దాదాపు 3,000 మందిపై పదేళ్ల పాటు సుదీర్ఘ అధ్యయనం నిర్వహించారు. ఈ పరిశోధనలో తేలిన ముఖ్యమైన విషయం ఏంటంటే, ప్రతిరోజూ నిద్రపోయే సమయంలో పెద్ద ఎత్తున మార్పులు చేసేవారిలో గుండెపోటు లేదా స్ట్రోక్ వచ్చే ప్రమాదం చాలా ఎక్కువగా ఉంది. ముఖ్యంగా ఎవరైతే రోజుకు ఎనిమిది గంటల కంటే తక్కువ నిద్రపోతారో, అటువంటి వారు నిద్రపోయే సమయాలను తరచుగా మార్చడం వల్ల వారి గుండెపై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతుంది. క్రమం లేని నిద్ర అలవాట్లు గుండెకు సంబంధించిన తీవ్రమైన సమస్యల ముప్పును ఏకంగా రెట్టింపు చేస్తాయని ఈ అధ్యయనం పేర్కొంది.


గుండె ఆరోగ్యంపై నిద్ర ప్రభావం

మనం నిద్రపోయే సమయంలో గుండె వేగం, రక్తపోటు తగ్గుతాయి, ఇది గుండెకు ఒక రకమైన విశ్రాంతిని ఇస్తుంది. అయితే నిద్రపోయే సమయాలు రోజుకో రకంగా ఉంటే, శరీరం ఈ విశ్రాంతి ప్రక్రియకు అలవాటు పడలేదు. దీనివల్ల రక్తనాళాల్లో ఒత్తిడి పెరిగి గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కేవలం ఎన్ని గంటలు నిద్రపోతున్నాం అన్నదే కాదు, ఏ సమయానికి నిద్రపోతున్నాం అనేది కూడా అత్యంత కీలకమని వైద్య నిపుణులు చెబుతున్నారు. రాత్రిపూట నిలకడగా ఒకే సమయానికి పడుకోవడం వల్ల శరీరంలోని హార్మోన్ల సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుంది, ఇది దీర్ఘకాలంలో ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

నివారణ మార్గాలు

గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి నిద్ర విషయంలో కొన్ని క్రమశిక్షణతో కూడిన మార్పులు చేసుకోవడం అవసరం. రాత్రిపూట పడుకోవడానికి ఒక స్థిరమైన సమయాన్ని నిర్ణయించుకోవాలి, వారాంతాల్లో కూడా దీనిని సాధ్యమైనంత వరకు పాటించాలి. పడుకోవడానికి గంట ముందు మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌లకు దూరంగా ఉండటం వల్ల మెదడు ప్రశాంతంగా మారి త్వరగా నిద్ర పట్టేలా చేస్తుంది. మధ్యవయసులో ఉన్నవారు తమ నిద్ర అలవాట్లపై ప్రత్యేక దృష్టి సారించడం వల్ల భవిష్యత్తులో వచ్చే హార్ట్ ఎటాక్, స్ట్రోక్ వంటి ముప్పులను నివారించవచ్చు. మంచి నిద్ర కేవలం మెదడుకే కాదు, మీ గుండెకు కూడా ప్రాణం పోస్తుంది. కాబట్టి మీ నిద్ర సమయాలను క్రమబద్ధీకరించుకోండి, ఆరోగ్యంగా ఉండండి. ఈ ముఖ్యమైన విషయాన్ని మీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు కూడా తెలియజేయండి.

## ప్రతిరోజూ రెండు కివీ పండ్లు తింటే శరీరంలో ఏం జరుగుతుందో తెలుసా.. అస్సలు ఊహించలేరు..



మలబద్ధకం నుంచి విముక్తి పొందాలంటే కివీ పండే మేలని పరిశోధనలు చెబుతున్నాయి. ప్రతిరోజూ ఉదయం రెండు కివీ పండ్లు తీసుకుంటే కడుపు క్లీన్ అవ్వడమే కాదు.. మీ రోగనిరోధక శక్తి కూడా బుల్లెట్ వేగంతో పెరుగుతుంది. అసలు కివీ పండు గురించి వైద్య నిపుణులు చెబుతున్న ఆశ్చర్యకరమైన విషయాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

నేటి ఉరుకుల పరుగుల జీవితం, మారిన ఆహారపు అలవాట్ల వల్ల మలబద్ధకం, గ్యాస్ వంటి జీర్ణ సమస్యలు ఇంటింటికీ సాధారణమైపోయాయి. ఈ సమస్యల నుండి ఉపశమనం పొందడానికి చాలామంది రకరకాల మందులు వాడుతుంటారు. అయితే వీటన్నింటికంటే ప్రతిరోజూ రెండు కివీ పండ్లు తినడం వల్ల అద్భుతమైన ఫలితాలు ఉంటాయని తాజా వైద్య పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. సుమారు 184 మందిపై నిర్వహించిన ఒక అధ్యయనంలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. పరిశోధకులు వీరిని రెండు బృందాలుగా విభజించి, ఒక బృందానికి ప్రతిరోజూ రెండు కివీ పండ్లు, మరో బృందానికి ఇసబ్గోల్ లేదా సైలియం పొట్టు ఇచ్చారు. నాలుగు వారాల తర్వాత చూస్తే.. కివీ పండ్లు తిన్నవారిలో జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా, కడుపునొప్పి, ఒత్తిడి వంటి సమస్యలు గణనీయంగా తగ్గినట్లు గుర్తించారు.

జీర్ణ వ్యవస్థకు సంజీవని

కివీ పండులో ఉండే యాక్టినిడిన్ అనే ఎంజైమ్, అధిక ఫైబర్ కంటెంట్ ఆహారాన్ని త్వరగా జీర్ణం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇందులో ఉండే కరిగే ప్రీబయోటిక్ ఫైబర్ ప్రేగులలోని మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు దోహదపడి, కడుపును ఆరోగ్యంగా ఉంచుతుంది.

రోగనిరోధక శక్తికి కేరాఫ్ అడ్రస్

కేవలం జీర్ణక్రియకే కాదు, కివీ పండు రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా మేటి. కివీలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది జలుబు, దగ్గు వంటి అంటువ్యాధుల నుండి రక్షణ ఇస్తుంది. రోజూ రెండు గోల్డెన్ కివీ పండ్లు తినే వృద్ధులలో గొంతు నొప్పి, ముక్కు దిబ్బడ వంటి సమస్యలు తక్కువగా ఉంటాయని, ఒకవేళ అనారోగ్యం సోకినా వారు చాలా వేగంగా కోలుకుంటారని అధ్యయనం తేల్చింది. ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. బరువు నియంత్రణ: తక్కువ కేలరీలు, ఎక్కువ ఫైబర్ ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి ఎంపిక. కంటి చూపు: కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ల్యూటిన్, జీక్సాంథిన్ వంటి మూలకాలు కివీలో ఉన్నాయి. చర్మ సౌందర్యం: యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని కాంతివంతంగా మార్చుతాయి. జాగ్రత్తలు తప్పనిసరి కివీలో ఎన్ని ప్రయోజనాలు ఉన్నా, కొందరికి ఇది అలెర్జీని కలిగించవచ్చు. నోరు వాపు లేదా దురద వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. మొదట్లో తక్కువ పరిమాణంలో తింటూ మీ శరీరానికి ఇది పడుతుందో లేదో చూసుకోవడం మంచిది.

## బియ్యం, పప్పులు పాడవుతున్నాయని బాధపడుతున్నారా.. ఈ చిన్న పని చేస్తే ఎన్నాళ్లైనా తాజాగా ఉంటాయని తెలుసా!

బియ్యం, పప్పులు, ధాన్యాలు ఎక్కువ కాలం నిల్వ ఉంచితే వాటిలో రకరకాల పురుగులు పడతాయి. అయితే, వంటింట్లో ఉండే చిన్న చిన్న వస్తువులతోనే ఈ పురుగుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపవచ్చు. రసాయన పురుగుమందుల జోలికి వెళ్లకుండా, మన పూర్వీకులు అనుసరించిన సహజ సిద్ధమైన పద్ధతులతో ధాన్యాలను ఎలా కాపాడుకోవాలో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

వంటగదిలో మనం ఎంతో కష్టపడి దాచుకున్న బియ్యం, మినపప్పు వంటి ధాన్యాలకు పురుగులు లేదా ముక్కు పురుగులు పట్టడం అనేది గృహిణులకు పెద్ద సమస్య. ఈ పురుగులు కేవలం ఆహారాన్ని పాడు చేయడమే కాకుండా, మన ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతాయి. “ఆహారమే ఔషధం” అని నమ్మే మన సంస్కృతిలో, మనం తినే గింజలను సురక్షితంగా ఉంచుకోవడం మన బాధ్యత.

సరైన నిల్వ పద్ధతులు

ధాన్యాలను నిల్వ చేసేటప్పుడు పాత్ర ఎంపిక చాలా ముఖ్యం. ఎల్లప్పుడూ స్టెయిన్‌లెస్ స్టీల్ లేదా నాణ్యమైన ప్లాస్టిక్ గాలి చొరబడని డబ్బాలను మాత్రమే వాడాలి. డబ్బాలో తేమ ఉంటే పురుగులు త్వరగా చేరుతాయి, కాబట్టి వాడే ముందు పాత్రను ఎండలో బాగా ఆరబెట్టాలి. ఒక చిన్న తేమ చుక్క ఉన్నా అది పురుగులు గుడ్లు పెట్టడానికి అనుకూలంగా మారుతుంది.

సాంప్రదాయ నివారణ మార్గాలు

మన వంటగదిలో దొరికే ఎండు మిరపకాయలు పురుగులను తోలడంలో అద్భుతంగా పనిచేస్తాయి. బియ్యం లేదా పప్పుల డబ్బాలో 5 నుండి 10 ఎండు మిరపకాయలు వేస్తే,

## “ఎముకలు బలహీనమవుతున్నాయా” - తినే ఆహారం కూడా ప్రభావితం చేస్తుందని తెలుసా

### మీరు చేసే చిన్న తప్పులే ఎముకలను దెబ్బతీస్తాయట! - అవేంటో తెలుసా



మన శరీరానికి క్యాల్షియం చాలా కీలకమైన ఖనిజం. ఇది ఎముకలు, దంతాలను బలంగా ఉంచడమే కాకుండా, రక్తపోటును నియంత్రించడంలో, కండరాల పనితీరులో, నాడీ వ్యవస్థ సంకేతాలను పంపడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఈ క్రమంలో శరీరంలో క్యాల్షియం లోపిస్తే ఎముకలు బలహీనపడటంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అయితే, కొన్ని రకాల ఆహార పదార్థాలు శరీరంలోని క్యాల్షియం స్థాయిలను తగ్గించి, ఎముకలను మరింత బలహీనపరుస్తాయని నిపుణులు చెబుతున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

సాఫ్ట్ డ్రింక్స్ :

ఈ రోజుల్లో పార్టీలు, పెళ్లి వేడుక ఏదైనా సాఫ్ట్ డ్రింక్స్ సర్వసాధారణం. అయితే, వీటిని అతిగా తీసుకోవడం వల్ల క్యాల్షియం లోపం ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ డ్రింక్స్‌లో ఉండే ఫాస్పోరిక్ యాసిడ్ శరీరం క్యాల్షియాన్ని గ్రహించకుండా అడ్డుకుంటుందట. దీనివల్ల క్రమంగా ఎముకలలో క్యాల్షియం స్థాయిలు తగ్గిపోతాయి. ఈ క్రమంలో ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సాఫ్ట్ డ్రింక్స్ వినియోగాన్ని పరిమితం చేయడం మంచిదట. శీతల పానీయాలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల వాటిలో అదనపు చక్కెర అధికంగా ఉంటుంది, క్యాల్షియం అధికంగా ఉండే పానీయాల స్థానంలో వీటిని తీసుకోవడం వలన ఎముకలు విరిగే ప్రమాదం పెరుగుతుందని చీఫ్ఆశీఖిశ్రీ ౫ాఆఎత్షీఖితీఎ శీట వీవసఆఆషఆఅవ పేర్కొంది.

రెడ్ మీట్, ప్రాసెస్ చేసిన మాంసం :

వీటిని అతిగా తీసుకోవడం వల్ల శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరుగుతాయి. ఇది ఎముకల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందంటున్నారు నిపుణులు. ఈ ఆహార పదార్థాలు క్యాల్షియం గ్రహించుకునే శక్తిని అడ్డుకుని, ఎముకలను బలహీనపరుస్తాయని చెబుతున్నారు. అందువల్ల, ఎముకల ఆరోగ్యం మెరుగుపడాలంటే వీటి వినియోగాన్ని పరిమితం చేసుకోవడం మేలు.

స్వీట్స్, బేక్ చేసిన పదార్థాలు :

కేకులు, క్యాండీలు, కుక్కీలు వంటి పదార్థాలలో చక్కెర, రిఫైన్డ్ కార్బో హైడ్రేట్లు ఎక్కువ ఉంటాయి. ఇవి శరీరం క్యాల్షియం గ్రహించకుండా అడ్డుకుంటాయని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా, ఇవి శరీరంలో వాపును కలిగించి ఎముకలను మరింత బలహీనపరుస్తాయని హెచ్చరిస్తున్నారు. ఇలాంటి చక్కెర పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవడం మానేసి, వాటికి బదులుగా ఆరోగ్యకరమైన స్నాక్స్ ని ఎంచుకోవడం ఉత్తమం.

టీ :

టీలో కెఫీన్ ఉంటుంది. ఇది శరీరం క్యాల్షియం గ్రహించే శక్తిని తగ్గిస్తుంది. అతిగా టీ తాగడం ఎముకల ఆరోగ్యానికి హానికరమంటున్నారు నిపుణులు. ముఖ్యంగా, కెఫీన్ ఎక్కువగా ఉండే టీ లేదా కాఫీలు ఎముకల నుంచి క్యాల్షియం బయటకు వచ్చేలా చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా, ఎముకలు బలహీనపడతాయంటున్నారు. అందువల్ల, టీ వినియోగాన్ని పరిమితం చేసి, దానికి బదులుగా నీరు లేదా క్యాల్షియం ఎక్కువగా ఉండే తాజా పండ్ల రసాలను ఎంచుకోవడం మంచిది.

మద్యం :

మద్యాన్ని అధికంగా సేవించడం ఎముకల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మద్యం శరీరంలో క్యాల్షియం గ్రహణ శక్తిని తగ్గించడంతో పాటు ఎముకలను బలహీనపరుస్తుంది. దీనివల్ల ఎముకలు పెళుసుగా మారి విరిగే ప్రమాదం పెరుగుతుందంటున్నారు నిపుణులు. ఎముకలు బలంగా ఉండాలంటే, మద్యంకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. దీర్ఘకాలికంగా అమితంగా మద్యం సేవించడం వల్ల ఎముకల సాంద్రత తగ్గిపోవచ్చని చీఫ్ఆశీఖిశ్రీ ౫ాఆఎత్షీఖితీఎ శీట వీవసఆఆషఆఅవ పేర్కొంది. ఇది ఎముకలు సులభంగా విరిగిపోయేలా చేయడమే కాకుండా, అనారోగ్య సమస్యలకు, జీవన ప్రమాణాలు దెబ్బతినడానికి దారితీస్తుందని తెలిపింది.

నూనె పదార్థాలు :

సమోసాలు, ఫ్రైడ్ చికెన్, పకోడీల వంటి నూనె ఎక్కువగా ఉండే ఆహారాలు ఎముకలకు హాని కలిగిస్తాయంటున్నారు నిపుణులు. వీటిలో అనారోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయని చెబుతున్నారు. ఇవి శరీరంలో వాపును కలిగిస్తాయట. అంతేకాదు, ఆయిల్ ఫుడ్స్ క్యాల్షియం గ్రహణ శక్తిని ప్రభావితం చేసి, ఎముకలు బలహీనపడటానికి దారితీస్తుంది. ఇలాంటి ఆహారాలను పరిమితంగా తీసుకోవడం, తేలికపాటి, ఆరోగ్యకరమైన భోజనాన్ని ఎంచుకోవడం ఉత్తమంఇలాంటి ఆహార పదార్థాలకు బదులుగా, ఆహారంలో పాలు, పెరుగు, ఆకుకూరలు, తాజా పండ్లు, డ్రై ఫ్రూట్స్, విత్తనాల వంటి క్యాల్షియం అధికంగా ఉండే ఆహారాలను చేర్చుకోమంటున్నారు నిపుణులు. అలాగే, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఎముకలను బలపరిచే అలవాట్లను పాటించడం కూడా మేలని సూచిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## ప్రతిరోజూ ఏబీసీ జ్యూస్ తాగితే ఏమవుతుందో తెలుసా.. ఈ విషయాలు తప్పక తెలుసుకోండి..




ఆపిల్, బీట్‌రూట్, క్యారెట్‌ల కలయికతో కూడిన ఆరోగ్యకరమైన శక్తివంతమైన పానీయం.. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ముఖ్యంగా పిల్లలకు కంటి చూపు మెరుగుదల, రోగనిరోధక శక్తి పెంపొందించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ మూడు పదార్థాలు యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటాయి. వేసవిలో శరీర ఉష్ణోగ్రతను తగ్గించి, కూలింగ్ డ్రింక్‌గా అద్భుతంగా పనిచేస్తుంది. ఏబీసీ డ్రింక్ (ఆపిల్, బీట్‌రూట్, క్యారెట్) తయారీ విధానం, ప్రయోజనాలు తెలుసుకోండి. ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మంచి ఆహారాన్ని తీసుకోవడం.. ఉత్తమమైన జీవనశైలిని అనుసరించడం చాలా మంచిది.. అయితే, ఎండాకాలంలో బాడీని కూల్ గా ఉంచుకునేందుకు మంచి పానీయాలను, ఆహారాలను తీసుకోవాలి.. దీనివల్ల శరీరానికి పోషకాలు, శక్తి లభించడంతోపాటు.. ఆరోగ్యంగా ఉండవచ్చు.. వేసవి తాపం నుంచి బయటపడొచ్చు.. అలా మేలు చేసే పానీయాల్లో ఏబీసీ (౧ాజూజూశ్రీవ, దీవవ్‌తీశ్రీ, ఙుతీతీశ్రీ) జ్యూస్ ఒకటి.. యాపిల్, బీట్‌రూట్, క్యారెట్‌ల కలయికతో తయారైన అత్యంత పోషకమైన పానీయం.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు .. పలు సమస్యల నివారణకు సహాయపడుతుంది.. దీనిలోని పోషకాలు.. చర్మాన్ని కాంతివంతం చేయడంతోపాటు.. రోగనిరోధక శక్తిని పెంచుతాయి.. ఇంకా ఈ జ్యూస్ శరీరాన్ని డిటాక్స్ చేసి.. బరువు తగ్గడంలో సహాయపడుతుంది. ఈ జ్యూస్ ఖాళీ కడుపుతో తీసుకోవడం వల్ల ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు. నిపుణుల ప్రకారం.. ఏబీసీ డ్రింక్, కంటి చూపును మెరుగుపరిచే, శరీర ఉష్ణోగ్రతను తగ్గించే, రోగనిరోధక శక్తిని పెంచే ఒక అద్భుతమైన ఆరోగ్య పానీయం. యాపిల్, బీట్‌రూట్, క్యారెట్.. ఈ మూడు పదార్థాలు యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటాయి. పిల్లలకు బీట్‌రూట్ లేదా క్యారెట్ జ్యూస్‌లు విడిగా ఇవ్వడం కష్టమైనప్పుడు.. ఈ ఏబీసీ డ్రింక్ వారికి ఆకర్షణీయంగా ఉండి, మంచి ఆహారాన్ని అందించడంలో సహాయపడుతుంది.

ఏబీసీ డ్రింక్ తయారీకి కావలసిన పదార్థాలు:

యాపిల్ 1 బీట్‌రూట్ సగం క్యారెట్ 2 తేనె 1 టేబుల్ స్పూన్ పుదీనా కొద్దిగా తయారీ విధానం: 1. ముందుగా యాపిల్‌ను తొక్క తీసి చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. తొక్క తీయడం వల్ల జ్యూస్ మరింత రుచిగా, సులువుగా తయారవుతుంది. 2. బీట్‌రూట్‌ను కూడా తొక్క తీసి చిన్న ముక్కలుగా చేసుకోవాలి. బీట్‌రూట్ ఎక్కువ వేస్తే రుచి ఘాటుగా మారే అవకాశం ఉంటుంది కాబట్టి, సగం బీట్‌రూట్ మాత్రమే ఉపయోగించడం మంచిది. 3. క్యారెట్‌ను శు భ్రంగా కడిగి ముక్కలుగా కట్ చేసుకోవాలి. క్యారెట్‌కు తొక్క తీయాల్సిన అవసరం లేదు. 4. కట్ చేసుకున్న యాపిల్, బీట్‌రూట్, క్యారెట్ ముక్కలను ఒక మిక్సీ జార్‌లో వేయాలి. 5. అందులో కొద్దిగా పుదీనా ఆకులను వేసి, కొద్దిగా నీళ్లు (ఒక చుక్క) పోసి మెత్తగా నలిగే వరకు బ్లెండ్ చేయాలి. 6. బ్లెండ్ చేసిన మిశ్రమాన్ని వడకట్టి, స్వచ్ఛమైన జ్యూస్‌ను మాత్రమే తీసుకోవాలి. చాలామంది వడకట్టకుండా జ్యూస్‌ను తీసుకుంటారు.. కానీ అలా తీసుకోవడం వల్ల అధిక ఫైబర్ కారణంగా మూడు నుండి నాలుగు గంటల వరకు ఆకలి వేయకపోవచ్చు. జ్యూస్‌ను వడకట్టడం వల్ల పోషకాలు త్వరగా శరీరానికి అందుతాయి. జ్యూస్‌ను గ్లాస్‌లో పోసుకున్న తర్వాత, డయాబెటిస్ సమస్య ఉన్నవారు 1 నుండి 1.5 స్పూన్ల తేనెను కలుపుకోవచ్చు. సాధారణ వ్యక్తులు 3 నుండి 4 స్పూన్ల తేనెను ఉపయోగించుకోవచ్చు. రుచి కోసం అవసరమైతే కొద్దిగా నిమ్మరసం కలుపుకోవచ్చు, లేదా నిమ్మరసం లేకుండానే తీసుకోవచ్చు. ఈ జ్యూస్ రుచికరంగా ఉండటంతో పాటు ఎన్నో పోషకాలను అందిస్తుంది. బీట్‌రూట్, క్యారెట్‌లను సాధారణంగా కూరగాయల జ్యూస్‌లలో తీసుకుంటూ ఉంటారు.. వాటికి ఆపిల్‌ను జోడించడం ద్వారా వేసవిలో చక్కటి కూలింగ్ డ్రింక్‌గా మారుతుంది. ఇది ఏ వయసు వారికైనా సులువుగా తాగగలిగే పానీయం. ఈ ఏబీసీ డ్రింక్ వంటి ఆరోగ్యకరమైన పానీయాలను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. అయితే, ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉన్నవారు డాక్టర్ సలహా మేరకు తీసుకోవడం బెటర్..

## పిల్లలపై అరుస్తున్నారా.. మీ ప్రవర్తన ఎంత ప్రమాదం తెస్తుందో తెలిస్తే వణికిపోతారు

బయటి వ్యక్తుల ముందు మన పిల్లలతో మనం ఎలా ప్రవర్తిస్తాం అనేది కేవలం ఆ ఒక్క క్షణానికి పరిమితం కాదు. అది వారి వ్యక్తిత్వాన్ని చెక్కుతుంది, ప్రపంచం పట్ల వారి అవగాహనను మారుస్తుంది. ఇటీవల బీహార్‌లో ఒక తల్లి నడిరోడ్డుపై తన కూతురిని దారుణంగా కొట్టిన వీడియో సోషల్ మీడియాలో కలకలం రేపింది. ఇటువంటి సంఘటనలు తల్లిదండ్రుల బహిరంగ ప్రవర్తన పిల్లల మనసులపై ఎంతటి లోతైన గాయాలను చేస్తాయో గుర్తుచేస్తున్నాయి.

రోజంతా పిల్లాడిని చూసుకోవడం వల్ల కలిగే అలసట, ఆపై ఇంటి పనుల ఒత్తిడి.. ఇవన్నీ ఒక్కోసారి మన సహనాన్ని పరీక్షిస్తాయి. కిరాణా షాపులో వస్తువులన్నీ చిందరవందర చేస్తున్నాడనో లేదా మాట వినలేదనో అందరి ముందూ పిల్లాడిపై గట్టిగా అరవడం చాలామంది తల్లిదండ్రులకు అనుభవమే. ఆ క్షణంలో కోపం తగ్గాక, చిన్నారి ముఖంలో కనిపించే ఆ భయం, బాధ చూసి మనసు చివుక్కుమంటుంది. “అలా కాకుండా కాస్త శాంతంగా చెప్పి ఉంటే బాగుండేది” అని పశ్చాత్తాపం కలుగుతుంది.

పిల్లలు ప్రతిబింబాలు

పిల్లలు తమ తల్లిదండ్రులను చూసి, వారిని అనుకరిస్తూ పెరుగుతారు. మనం బయట ఇతరులతో గౌరవంగా, ప్రశాంతంగా మాట్లాడితే పిల్లలు కూడా అవే అలవాట్లను, సామాజిక నైపుణ్యాలను అలవర్చుకుంటారు. అదే మనం అందరి ముందూ అరిచినా, అసభ్యంగా ప్రవర్తించినా వారు కూడా అదే నేర్చుకుని స్నేహితులు లేదా తోటివారితో అలాగే ప్రవర్తిస్తారు. మనం ఎలా ప్రవర్తిస్తాం అనేదే వారికి మొదటి పాఠం అవుతుంది.

భావోద్వేగ నియంత్రణ

పిల్లలు మన మాటల ద్వారా కంటే మన చర్యల ద్వారానే ఎక్కువ నేర్చుకుంటారు. ఉదాహరణకు, మనకు చిరాకు కలిగినప్పుడు వెంటనే స్పందించకుండా కాసేపు ఆగి ప్రశాంతంగా ఉండటం చూసి, పిల్లలు తమ భావోద్వేగాలను ఎలా అదుపు చేసుకోవాలో నేర్చుకుంటారు. అలాగే మనం ఏదైనా తప్పు చేసినప్పుడు బహిరంగంగా క్షమాపణ చెబితే, వారు కూడా భయం వల్ల కాకుండా నైతిక బాధ్యతతో తప్పును ఒప్పుకోవడం నేర్చుకుంటారు.



దీర్ఘకాలిక ప్రభావాలు

పిల్లల ఎదుట మనం చేసే చిన్న పొరపాట్లు కూడా వారిపై లోతైన ప్రభావం చూపుతాయి. అందరి ముందూ అవమానానికి గురైన పిల్లలు భవిష్యత్తులో సామాజిక ఆందోళన, అతిగా భయపడటం లేదా ఎదురు తిరగడం వంటి లక్షణాలు ప్రదర్శిస్తారు. వారు ప్రపంచాన్ని ఒక అభద్రతా భావంతో చూస్తారు. ముఖ్యంగా ఇతరుల ముందు పిల్లల గురించి “వీడు మొండివాడు”, “ఆమెకు లెక్కలు రావు” వంటి ముద్రలు వేయడం వల్ల అవి వారి గుర్తింపుగా మారిపోతాయి. ఇది వారి ఆత్మవిశ్వాసాన్ని పూర్తిగా దెబ్బతీస్తుంది.

తల్లిదండ్రులకు సూచన

పిల్లల పెంపకం అంటే ప్రతిసారీ సరిగ్గా ఉండటం కాదు, మనం చేసే చిన్న చిన్న పనుల పట్ల స్పృహతో ఉండటం. పొరపాటున కోప్పడినా, ఆ తర్వాత పిల్లాడికి నచ్చజెప్పడం లేదా క్షమాపణ కోరడం వల్ల బంధం బలపడుతుంది. పిల్లల గౌరవానికి భంగం కలగకుండా వారి తప్పులను సరిదిద్దడం వల్ల వారు క్రమశిక్షణతో పాటు ఆత్మగౌరవాన్ని కూడా అలవర్చుకుంటారు. మీరు ఇచ్చే గౌరవం, చూపే సహనం వారిని రేపు ఒక బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దుతాయి.

# పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో అమానుష ఘటన...

## ఆరేళ్ల చిన్నారిపై 60 యేళ్ల వృద్ధుడి అఘాయిత్యం...

పశ్చిమగోదావరి//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): పశ్చిమగోదావరి జిల్లాలోని ఆచంట మండలంలో మానవత్వాన్ని కలచివేసే దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ మేజర్ పంచాయతీ పరిధిలో ఆరేళ్ల అమాయక చిన్నారిపై 60 ఏళ్ల వృద్ధుడు అఘాయిత్యానికి పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారి తీసింది. చిన్నారి కిరాణా షాపుకు వెళ్లిన సందర్భాన్ని దుర్వినియోగం చేసుకున్న నిందితుడు ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం.స్థానికుల కథనం ప్రకారం, బాధిత చిన్నారి తన ఇంటి సమీపంలోని కిరాణా దుకాణానికి వెళ్లగా, అక్కడే ఉన్న వృద్ధుడు ఆమెను మోసపూరితంగా తన ఆధీనంలోకి తీసుకొని ఈ ఘోరానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటన వెలుగులోకి రావడంతో గ్రామంలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. చిన్నారి ఆరోగ్యం విషమంగా మారడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బాధిత చిన్నారి తల్లిదండ్రులు వెంటనే ఆచంట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. అలాగే ఐసీడీఎస్ అధికారులకు కూడా సమాచారం అందించారు. ఘటనపై స్పందించిన పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. చిన్నారికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు ఆమెను పాలకొల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు బాలికకు అవసరమైన పరీక్షలు నిర్వహిస్తూ చికిత్స అందిస్తున్నారు. చిన్నారి పరిస్థితిని పర్యవేక్షిస్తున్న వైద్యులు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతూ, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. పోలీసులు ప్రాంతంలో అదనపు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని నియంత్రిస్తున్నారు.పిల్లలపై జరుగుతున్న ఇలాంటి దారుణ ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని, చిన్నారుల రక్షణకు మరింత కట్టుదిట్టమైన చర్యలు అవసరమని ప్రజలు కోరుతున్నారు. ఈ కేసులో నిందితుడికి కఠిన శిక్ష పడేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# హనుమకొండ జిల్లాలో పెళ్లికి ముందు వరుడు పరార్

## వరకట్న వివాదం కలకలం...

హన్మకొండ//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): హనుమకొండ జిల్లాలో పెళ్లికి కేవలం రెండు రోజుల ముందు వరుడు పరార్ కావడం కలకలం రేపింది. అదనపు వరకట్నం డిమాండ్ నెరవేర్చలేదనే కారణంతోనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వధువు కుటుంబ సభ్యులు వరుడు ఇంటి ముందు ఆందోళనకు దిగారు.వివరాల్లోకి వెళితేడ వధువు, వరుడు కుటుంబాల మధ్య ఇప్పటికే పెళ్లి నిశ్చయమై నిశ్చితార్థం కూడా ఘనంగా నిర్వహించారు. నిశ్చితార్థ సమయంలో వధువు కుటుంబం నుంచి రూ.10 లక్షల వరకట్నం ముందుగానే అందజేశారు. మిగతా రూ.15 లక్షలను పెళ్లి రోజున ఇవ్వడానికి సిద్ధమయ్యారు.అయితే, పెళ్లి సమయం దగ్గరపడుతుండగా వరుడు కుటుంబ సభ్యులు అదనంగా ముందుగానే రూ.9 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిసింది. అంత పెద్ద మొత్తాన్ని తక్షణం సమకూర్చడం సాధ్యం కాదని వధువు కుటుంబం తెలిపింది. ఈ విషయంపై ఇరు కుటుంబాల మధ్య విభేదాలు తలెత్తాయి.ఈ క్రమంలోనే పెళ్లికి రెండురోజుల ముందు వరుడు ఇంటి నుంచి కనిపించకుండా పోయాడు.దీంతో వధువు కుటుంబ సభ్యులు ఆగ్రహానికి గురై, ఇది ముందుగానే ప్రణాళికబద్ధంగా చేసిన పరార్ నాటకమని ఆరోపించారు.న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వరుడు ఇంటి ముందు వధువు కుటుంబ సభ్యులు నిరసన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వరకట్న వేధింపులపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## వేములవాడలో భీమేశ్వరుడి

# దర్శనం చేసిన మధుసూదనాచారి...

### కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన మండలి ప్రతిపక్ష నేత...

వేములవాడ//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన పరిధిలో ఉన్న శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి బుధవారం తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నాయకులు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి కుటుంబ సమేతంగా విచ్చేసి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, ఆలయ అధికారులు సంప్రదాయ పద్ధతిలో పూర్ణకుంభ స్వాగతం పలికి ఘనంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా మధుసూదనాచారి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తి పరవశంతో స్వామివారి సేవలో పాల్గొన్న ఆయన కుటుంబ సభ్యులు ఆలయ ఆధ్యాత్మిక వాతావరణంలో కొంతసేపు గడిపారు. అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందజేశారు.ఆలయ అధికారులు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి సత్కరించగా, ప్రసాదంగా లడ్డూలను అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి ఆలయ నిర్వహణ, అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించినట్లు తెలిసింది.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో

# విద్యుత్ సేవలు మీ సేవలో సులభతరం...

రాజన్నసిరిసిల్ల//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): రాజన్నసిరిసిల్ల జిల్లాలో విద్యుత్ వినియోగ దారులకు శుభవార్త. ఇకపై విద్యుత్ సేవలు పొందడం మరింత సులభతరం కానుంది. కొత్త విద్యుత్ కనెక్షన్లు సహా వివిధ సేవలను "మీ సేవ" కేంద్రాల ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సిరిసిల్ల సూపరింటెండింగ్ ఇంజనీర్ (రాజు) బి. బిక్షపతి వెల్లడించారు.బుధవారం సిరిసిల్ల పట్టణంలోని మీ సేవ కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అక్కడ జరుగుతున్న సేవల నమోదు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బిక్షపతి, విద్యుత్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వినియోగదారులకు సౌకర్యం కల్పించడమే ఈ నిర్ణయం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.మీ సేవ కేంద్రాల ద్వారా గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన వివరించారు. అలాగే కనెక్షన్ పేరు మార్పు, లోడ్ పెంపు లేదా తగ్గింపు, తాత్కాలిక కనెక్షన్లు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు వంటి అనేక సేవలు కూడా ఇక్కడే పొందవచ్చని పేర్కొన్నారు.చెల్లింపులు చేసిన వెంటనే వినియోగదారులకు రసీదు అందజేస్తామని స్పష్టం చేసిన ఆయన, అన్ని దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా ప్రక్రియ కొనసాగుతుందని హామీ ఇచ్చారు.జిల్లా ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని సమయం, ఖర్చును ఆదా చేసుకోవాలని సిరిసిల్ల ఎస్ఈ బి. బిక్షపతి కోరారు.

## వేములవాడలో న్యాయవాదికి

# ప్రాణహాని బెదిరింపులు కలకలం...

### కోర్టు బహిష్కరణతో న్యాయవాదుల నిరసన...



రాజన్నసిరిసిల్ల//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో న్యాయవాదికి ప్రాణహాని బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపింది. వేములవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు, మాజీ అధ్యక్షుడు పిట్టల భూమేష్‌ను చంపుతానని బెదిరించిన ఘటనపై న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ ఘటనను ఖండిస్తూ వేములవాడ కోర్టు విధులను బహిష్కరించిన న్యాయవాదులు, కోర్టు ప్రధాన ద్వారం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. న్యాయవృత్తికి భంగం కలిగించే ఇలాంటి చర్యలను సహించబోమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, ధర్మపురి పట్టణానికి చెందిన రౌడీషీటర్ గంగాధర్ పిట్టల భూమేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా ప్రాణహాని బెదిరింపులకు పాల్పడడం అత్యంత ఖండనీయమని తెలిపారు. న్యాయవాదుల భద్రతకు భంగం కలిగించే ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి, సంబంధిత వ్యక్తిపై కఠిన చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇలాంటి సంఘటనలు న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని పేర్కొంటూ, నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి తగిన శిక్ష విధించాలని న్యాయవాదులు కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గొంటి శంకర్, ప్రధాన కార్యదర్శి పుప్పాల భాను కృష్ణ, సంయుక్త కార్యదర్శి కనికరపు శ్రీనివాస్, కోశాధికారి జెట్టి శేఖర్, గ్రంథాలయ కార్యదర్శి మొగిలి సుజాత, క్రీడల కార్యదర్శి వంగల కర్ణ, మహిళ ప్రతినిధి తమిరి అన్నపూర్ణతో పాటు పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి గర్భవతి సురక్షిత మాతృత్వం పొందేలా వైద్య సిబ్బంది కృషి చేయాలి...

## నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ పి. అమరేందర్...





నాగర్ కర్నూల్//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): ప్రతి గర్భవతి సురక్షిత మాతృత్వం పొందేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ పి. అమరేందర్ సూచించారు. బుధవారం నాడు 99 రోజుల ఆరోగ్య మిషన్ కార్యక్రమం సందర్భంగా, నాగర్ కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో గర్భవతులు మరియు బాలింతల కోసం నిర్వహించిన "సురక్షిత మాతృత్వం" అవగాహన కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ ప్రారంభించారు. అదనపు కలెక్టర్ పి. అమరేందర్ మాట్లాడుతూ, మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం, సమాజం బాగుంటుందని, మహిళా ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి మహిళ విద్యావంతురాలు అయితే వైద్యులు ఇచ్చే సూచనలు, సలహాలను పాటించగలుగుతారని, గర్భధారణకు ముందు మానసికంగా సిద్ధపడడం ముఖ్యమని వివరించారు.అవగాహనలో ముఖ్యమైన విషయాలుగా రక్తహీనత నివారించడానికి ఆకుకూరలు, కాయగూరలు, పళ్ళు, తృణధాన్యాల వంటి పౌష్టికాహారాన్ని తీసుకోవడం, వైద్యుల సూచనలను పాటించడం, బిడ్డకు మధ్య 3 సంవత్సరాల కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించడం గుర్తుచేశారు.డి ఎం హెచ్ ఓ డాక్టర్ కే. రవికుమార్ గారు గర్భం దాల్చిన మహిళలు 12 వారాల లోపు ఎ ఎన్ ఎం దగ్గర నమోదు చేసుకోవాలని, ఐరన్ ఫోలిక్ క్యాప్సిల్స్, క్యాల్షియం మాత్రలు తప్పక తీసుకోవాలని, గైనకాలజిస్ట్ వైద్యుల సూచనలు పాటించాల్సినదిగా సూచించారు. అలాగే సాధారణ ప్రసవం కోసం వ్యాయామాలు, పౌష్టికాహారం, బర్త్ ప్లానింగ్ గురించి అవగాహన కల్పించారు.జి జి హెచ్ సూపరిండెంట్ డాక్టర్ టి. ఉషారాణి మాట్లాడుతూ, గర్భం దాల్చిన ప్రతి మహిళ కాన్పు తర్వాత తల్లి బిడ్డ సురక్షితంగా ఉండేలా ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని, జిల్లా ఆసుపత్రిలో సుశిక్షిత నర్సింగ్ సిబ్బంది, వైద్య నిపుణులు ఉన్నారని, వారి సూచనలు పాటిస్తే 90 శాతం సాధారణ ప్రసవాలు సులభంగా జరిగే అవకాశం ఉందని తెలిపారు.తదుపరి కార్యక్రమంలో డాక్టర్ నీలిమ, డాక్టర్ సుప్రియ గారు గర్భవతులు, బాలింతలకు తగిన సూచనలు తెలియజేశారు. చివరగా అదనపు కలెక్టర్ పి. అమరేందర్ గారి చేతిలో సురక్షిత మాతృత్వం పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జి జి హెచ్ డాక్టర్ రవిశంకర్, డాక్టర్ ప్రశాంత్, ఆర్ఎంఓ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మణ్, ఉపజిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాలాచారి, నర్సింగ్ సూపరింటెండెంట్లు, హెల్త్ ఎడ్యుకేటర్ నరసింహ, గ్రామాల గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రతి గర్భవతికి సురక్షిత, ఆరోగ్యకరమైన మాతృత్వాన్ని అందించేందుకు జిల్లా వైద్య సిబ్బంది కృషి చేయడం మరింతగా ముందడుగు వేయనుంది.

# ఇద్దరు పిల్లల తల్లిని పెళ్లి చేసుకున్న 18 ఏళ్ల యువతి...

### కుటుంబాల వ్యతిరేకత మధ్య ఇంటి నుంచి పారిపోయిన జంట...

### ప్రాణభయంతో పోలీసు రక్షణ కోరిన మహిళలు...

### బీహార్‌లో సంచలనంగా మారిన విభిన్న వివాహం...



బీహార్//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): బీహార్ రాష్ట్రంలో ఒక విభిన్నమైన మరియు చర్చనీయాంశమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే ఇద్దరు పిల్లల తల్లిగా ఉన్న 32 ఏళ్ల సంధ్యా దేవిని, కేవలం 18 ఏళ్ల యువతి రూబీ వివాహం చేసుకోవడం స్థానికంగా సంచలనంగా మారింది. ఈ ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారి తీస్తోంది.వివరాల్లోకి వెళ్తే, సంధ్యా దేవి మరియు రూబీ మొదట సోషల్ మీడియా వేదికగా పరిచయం అయ్యారు. రీల్స్ తయారు చేస్తూ ఒకరితో ఒకరు పరిచయం పెంచుకున్న వీరి స్నేహం కేవలం 15 రోజుల్లోనే ప్రేమగా మారింది. ఈ పరిచయం క్రమంగా మరింత బలపడుతూ, ఒకరిని ఒకరు విడిచిపెట్టలేని స్థితికి చేరుకున్నారు.ఈ నేపథ్యంలో, తమ ప్రేమను కొనసాగించేందుకు మరియు కలిసి జీవించాలనే సంకల్పంతో ఇద్దరూ ఇంటి నుంచి పారిపోయి, వివాహం చేసుకున్నారు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలిసిన వెంటనే, వారి నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. కుటుంబ సభ్యుల నుంచి బెదిరింపులు రావడంతో, ప్రస్తుతం ఈ జంట పోలీసులను ఆశ్రయించి రక్షణ కోరింది.ఇద్దరు పిల్లల తల్లిగా ఉన్న సంధ్యా దేవి తన పిల్లలను వదిలి వెళ్లడంపై కూడా చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు, రూబీ వయస్సు తక్కువ కావడం, ఆమె తీసుకున్న నిర్ణయంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ ఇద్దరూ తమ ప్రేమ నిజమైనదని, కలిసి జీవించడమే తమ లక్ష్యమని స్పష్టం చేస్తున్నారు.ఈ ఘటన సమాజంలో లింగ భేదం, వ్యక్తిగత స్వేచ్ఛ, కుటుంబ విలువలు వంటి అంశాలపై మరోసారి చర్చను తెరపైకి తీసుకొచ్చింది. పోలీసులు ఈ విషయంపై దర్యాప్తు ప్రారంభించి, ఇద్దరికీ భద్రత కల్పించే చర్యలు తీసుకుంటున్నారు.ఈ సంఘటన ప్రస్తుతం బీహార్ రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# ఓదెల మండలంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి...


## పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ...



ఓదెల//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ కృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన, కొలనూర్ రైల్వే గేట్ వద్ద కొనసాగుతున్న మూడో రైల్వే లైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఎంపీ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా పెద్దపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్ ఎంపీని మర్యాద పూర్వకంగా కలిసి స్థానిక సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కొలనూర్ ప్రాంతానికి ఫ్లైఓవర్ మంజూరు చేయడంలో ఎంపీ చేసిన కృషికి స్థానిక నాయకులతో కలిసి సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు. మాట్లాడిన గుండేటి ఐలయ్య యాదవ్, ఓదెలతో పాటు పోత్కపల్లి ప్రాంతాల్లో కూడా ఫ్లైఓవర్లు మంజూరు చేయాలని కోరారు. మండలంలోని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, ముఖ్య రైళ్లు స్థానిక స్టేషన్లలో ఆగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుని వారికి తగిన గౌరవం కల్పించాలని కోరారు.ఈ అంశాలపై స్పందించిన ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, ప్రజల సమస్యలను రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం ఈ ప్రాంతంలో ప్రయాణ సౌకర్యం మరింత మెరుగుపడుతుందని తెలిపారు.పర్యటనలో భాగంగా ఎంపీ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం కొలనూర్‌లో రేషన్ షాప్‌ను పరిశీలించి సరఫరా విధానంపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పల్లె కనకయ్య, కాసారపు ఐలయ్య గౌడ్, అల్లం సతీష్, గాజుల శివశంకర్, ఆసరి ఎర్రయ్య, మేర శంకరయ్య, సాతూరి రాజేశం, బండారి చంద్రయ్య, మాటూరి రత్నం, చంద్రయ్య, సదయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఉదండాపూర్ గ్రామస్థుల కృతజ్ఞతా ఘట్టం...

## ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం...



జడ్చర్ల//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇచ్చే పరిహారం రూ.18 లక్షలకు పెంచినందుకు ఉదండాపూర్ గ్రామస్థులు బుధవారం నాడు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంలో గ్రామస్థులు తమ ప్రేమాభిమానాలను, కృతజ్ఞతలను వ్యక్తం చేశారు.ఇందుకు ముందు సింగిల్ ఫ్యామిలీకి రూ.6.5 లక్షలు, జాయింట్ ఫ్యామిలీకి రూ.16 లక్షలు ఇచ్చే అవకాశం ఉందని ప్రకటించినప్పటికీ, ఎన్నికల ముందు పరిహారాన్ని పెంచి ఇచ్చే హామీ ఇచ్చిన అనిరుధ్ రెడ్డి, ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత కూడా ఇదే మాటపై నిలబడ్డారు.వీటికి కారణంగా, ఉదండాపూర్ నిర్వాసితులు అందరి సంక్షేమం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన వారు. అందుకే సింగిల్, జాయింట్ ఫ్యామిలీ మధ్య తేడా లేకుండా ఒకే విధమైన పెంపును డిమాండ్ చేశారు. అనిరుధ్ రెడ్డి ఈ సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ఇరిగేషన్ మినిస్టర్ ఉత్తమ్ కుమార్ రెడ్డితో పలుమార్లు సమావేశమై పరిష్కరించారు.అంతేకాక,రాష్ట్ర ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఉదండాపూర్ నిర్వాసితులకు ఇచ్చే పరిహారాన్ని రూ.18 లక్షలకు పెంచింది. గతంలో రూ.6.5 లక్షలు మాత్రమే పొందేవారికి అదనంగా రూ.12 లక్షలు, రూ.16 లక్షలు పొందేవారికి అదనంగా రూ.2 లక్షలు చెల్లించబడతాయి. మొత్తం రూ.142 కోట్ల అదనపు పరిహారం మంజూరు చేయబడింది. ఇటీవల రూ.150 కోట్లు విడుదల చేశారు, మరికొంతమంది రూ.200 కోట్లు ఈనెలలో విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.ఈ ఘనవిభాగంలో, ఉదండాపూర్ సర్పంచ్ తంగెళ్లపల్లి శేఖర్, డిప్యూటీ సర్పంచ్ మ్యాతరి నరేష్, వార్డు సభ్యులు జహంగీర్, జ్యోతి శేఖర్, సుధారాణి లింగం గౌడ్, పార్టీ నేతలు జడ్చర్ల మల్లయ్య, పాతింటి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ, "ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన కృషితో మా జీవితాల్లో వెలుగు వచ్చిందని ఆయన పట్ల మనం ఎప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు.

# విద్యుత్ కార్మికుల నిరవధిక సమ్మె...

## డిమాండ్లు వెంటనే తీర్చాలంటూ ఆందోళన...




పెద్దపల్లి//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించమని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ కార్మికులు పెద్దపల్లి ఎస్ఈ కార్యాలయం వద్ద బుధవారం నుండి నిరవధిక సమ్మె చేపట్టారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్, ఆన్ మ్యాన్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ సమ్మె నిర్వహించబడుతోంది.ఆర్టిజన్ కార్మికులు స్టాండింగ్ ఆర్డర్‌ను రద్దు చేసి ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, ఆన్ మ్యాన్ కార్మికులను ఆర్టిజన్స్‌గా గుర్తించి సంస్థలో విలీనం చేయమని, మీటర్ రీడర్స్, పీస్ రేటు కార్మికులకు జీఓ 11 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయమని ప్రధాన డిమాండ్లుగా జేఏసీ నాయకులు ప్రకటించారు.మన సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగుతుంది. ప్రభుత్వం, విద్యుత్ సంస్థ వెంటనే స్పందించి మా డిమాండ్లను తీర్చాలి," అని జేఏసీ నేతలు స్పష్టం చేశారు.సమ్మెలో తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ పెద్దపల్లి జిల్లా చైర్మన్ మల్ల కిషన్ రెడ్డి, ఆన్ మ్యాన్ జిల్లా అధ్యక్షులు ఇరుగురాల రమేష్, ఆర్టిజన్ కార్మికులు ఎల్లయ్య, దాసరి కోటి, గొపతి తిరుపతి, ఆది కొండల్, జంబోజు భాస్కర్, రాపోలు సురేష్, కె. రఘు, ఎస్. ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.సమ్మె కార్యక్రమం నేపథ్యంలో పెద్దపల్లి ఎస్ఈ కార్యాలయం చుట్టూ సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను పెంచినట్టు అధికారులు తెలిపారు.

# మాదిగ శక్తి నూతన పట్టణ కమిటీ ఏర్పాటు...



పెద్దపల్లి//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): మాదిగ శక్తి పెద్దపల్లి పట్టణ నూతన కమిటీని బుధవారం వేడుకగా ఏర్పాటు చేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్ సన్ని అధ్యక్షతన కమిటీని ప్రకటించారు. కమిటీ అధ్యక్షునిగా కుక్క రవి నియమించబడగా, ఉపాధ్యక్షులుగా అంతర్గామ్ శ్రీనివాస్ మరియు కుక్క మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా ఆర్నకొండ ఈశ్వర్, కార్యదర్శిగా జనగామ శ్రావణ్ కుమార్, ప్రచార కార్యదర్శిగా జోగు ఆశిష్, కోశాధికారిగా బొంకూరి శ్రీధర్ ను నియమించినట్లు వివరించారు.జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు సురేందర్ సన్ని మాట్లాడుతూ, మాదిగలలో అట్టడుగు స్థాయిలో ఉన్న నిజమైన నిరుపేదల పక్షాన నిలబడే ధైర్యం ఉండాల్సిన అవసరాన్ని రైలీషించారు. అలాగే, మాదిగ శక్తి సుస్థిర లక్ష్యాలకు అనుగుణంగా అన్ని వర్గాల ప్రజలతో మమేకమై, రాష్ట్ర రాజకీయాల్లో మాదిగల హక్కుల కోసం పద్ద పోరాటంలో నూతన కమిటీ ముందుండాలని సూచించారు. సమావేశం అనంతరం సీనియర్ మాదిగ నాయకులు బొంకూరి రమేష్, బొంకూరి నర్సయ్య శాలువా వారు నూతన కమిటీ సభ్యులను సన్మానించి ఆశీర్వదించారు.ఈ నియామకంతో పెద్దపల్లి మాదిగ శక్తి రాజకీయ ప్రస్థానంలో కొత్త చైతన్యం కలిగే అవకాశం ఉందని వర్గాలు పేర్కొన్నాయి.

# ప్రేమపెళ్లి పేరుతో వేధింపులు

### యువకుడు అరెస్ట్...

### అమ్మాయిలను వెంటపడి వేధిస్తే కఠిన చర్యలు...డిఎస్పీ నాగేంద్రచారి హెచ్చరిక



సిరిసిల్ల//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): ప్రేమపెళ్లి పేరుతో యువతిని వేధించిన ఘటనలో ఒక యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రుద్రంగి మండలానికి చెందిన సింగారపు గణేష్ అనే వ్యక్తి ఒక యువతితో పరిచయం పెంచుకుని, ఆమెతో మాట్లాడుతూనే ప్రేమిస్తున్నానని చెప్పి తనను పెళ్లి చేసుకోవాలని పదేపదే వేధింపులకు గురిచేసినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ మేరకు బాధిత యువతి సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతన్ని కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా డిఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, ప్రేమ పెళ్లి పేరుతో వెంటపడడం, ఫోటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెట్టేస్తామని బెదిరించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అవసరమైతే అలాంటి వ్యక్తులపై రౌడీ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని స్పష్టం చేశారు. వేధింపులకు గురైన యువతులు భయపడకుండా ముందుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతూ పూర్తి రక్షణ కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

## పెద్దపల్లి జిల్లా ఆసుపత్రికి రాష్ట్ర స్థాయి గుర్తింపు...

నాలుగు అవార్డులతో ఘన విజయం...



పెద్దపల్లిటౌన్//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వైద్య విధాన పరిషత్ అవార్డుల్లో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి ప్రతిభను చాటుతూ రాష్ట్ర స్థాయిలో నాలుగు ప్రతిష్టాత్మక అవార్డులు సాధించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సేవలు అందించినందుకు ఆసుపత్రి సూపరింటెండెంట్, సివిల్ సర్జన్ (అనస్థీషియా విభాగం) డాక్టర్ కే. శ్రీధర్ ప్రథమ అవార్డును అందుకున్నారు. అదేవిధంగా 3 వేలకుపైగా ఆరోగ్యశ్రీ కేసులను విజయవంతంగా నిర్వహించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నందుకు రెండవ అవార్డు లభించింది. తెలంగాణ డయాగ్నస్టిక్ సేవల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రంలోనే ముందంజలో నిలిచినందుకు మూడవ అవార్డు దక్కగా, రేడియాలజీ విభాగం తరపున డాక్టర్ సంధ్యారాణి నాలుగో అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా వైద్య బృందం తమకు లభించిన అవార్డులను జిల్లా కలెక్టర్‌కు చూపించగా, ఆయన తన చాంబర్‌లో సూపరింటెండెంట్, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, సపోర్టింగ్ మరియు సానిటేషన్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం గర్వకారణమని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో మరింత నాణ్యమైన వైద్య సేవలను అందిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఉచిత, నాణ్యమైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## రేషన్ దుకాణాల్లో బియ్యం కొలతలలో భారీ అక్రమాలు...

డీలర్లపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్...

గోదావరిఖని//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): రామగుండం నియోజకవర్గంలోని పలు రేషన్ దుకాణాల్లో బియ్యం కొలతలలో భారీ తేడాలు చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వము సరఫరా చేస్తున్న బియ్యం పేద ప్రజలకు పూర్తి స్థాయిలో అందకుండా, కొంత మేర కాజేస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రతి రేషన్ కార్డుకు 20 కిలోల బియ్యం అందించాల్సి ఉండగా, కేవలం 18 కిలోల మాత్రమే ఇస్తున్నారని బాధితులు పేర్కొంటున్నారు. రెండు కిలోల వరకు తక్కువగా బియ్యం ఇస్తూ, దీనిపై ప్రశ్నిస్తే "ఎలక్ట్రానిక్ కాంటా వల్ల తక్కువ వస్తోంది" అంటూ రేషన్ డీలర్లు సమాధానం చెబుతున్నారని ప్రజలు అంటున్నారు.రామగుండం నియోజకవర్గంలోని 41వ డివిజన్ రేషన్ షాప్‌లో జరిగిన కొలతల పరిశీలనలో 72 కిలోల బియ్యం రావాల్సి ఉండగా, మరో దుకాణంలో అదే బియ్యం కొలిచినప్పుడు కేవలం 68 కిలోలు మాత్రమే వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో కొలతలలో గణనీయమైన తేడాలు ఉన్నాయని స్పష్టమవుతోంది.ప్రతి ఇంటికి సుమారు 2 నుండి 4 కిలోల వరకు బియ్యం తక్కువగా అందుతున్నట్లు సమాచారం. ఈ విధంగా సుమారు 3000 మంది లబ్ధిదారులకు నష్టం జరుగుతుండటంతో, డీలర్ల వద్ద పెద్ద మొత్తంలో బియ్యం మిగులుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ విషయంపై గూడపు రణధీర్ మాట్లాడుతూ, ప్రతి రేషన్ కార్డు పై ఎంత బియ్యం మిగులుతుందో లెక్కిస్తే, పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని అర్థమవుతుందని అన్నారు. మిగులుతున్న బియ్యం ఎక్కడికి పోతుందో అధికారులు విచారణ జరిపి బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.ఇలాంటి అక్రమాలు కేవలం ఒకటి రెండు దుకాణాల్లో మాత్రమే కాకుండా, మరికొన్ని ప్రాంతాల్లో కూడా జరుగుతున్నాయని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తునికి కొలతల అధికారుల ద్వారా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. పేద ప్రజలకు అందాల్సిన ఆహార భద్రత పథకాలలో ఈ విధమైన అవకతవకలు జరుగుతుండటంపై అధికారులు వెంటనే స్పందించి, న్యాయం చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి...

నాగర్‌కర్నూల్//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.వివరాల్లోకి వెళితే... నాగర్‌కర్నూల్ మండలంలోని గగ్గలపల్లి గ్రామానికి చెందిన పాలడుగుల చెన్నయ్య (46) వ్యక్తిగత పనిమీద మంగళవారం రాత్రి నాగర్‌కర్నూల్ వైపు వెళ్తుండగా మంతటి చౌరస్తా సమీపంలో ప్రమాదానికి గురయ్యాడు. చెన్నయ్య ప్రయాణిస్తున్న సమయంలో ఓ ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువులు దుఃఖంలో మునిగిపోయారు. మృతుని భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

## షాద్‌నగర్‌లో సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ...



షాద్ నగర్//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): ప్రజల ఆరోగ్య అవసరాల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను షాద్‌నగర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసుతో కొత్తూరు మండలం మక్తగూడ గ్రామానికి చెందిన కాట్న బాల్‌రాజ్, కౌకుంట్ల భాగ్యమ్మలకు మంజూరైన సహాయ నిధి చెక్కులను గ్రామ బిఆర్ఎస్ నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అవసరంలో ఉన్న ప్రజలకు సీఎం సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా మారుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మక్తగూడ మాజీ సర్పంచ్ కట్న రాజు, ఉపసర్పంచ్ రాములు, బిఆర్ఎస్ నాయకులు పెండ్లి మడుగు రాజు గౌడ్, సుధాకర్ గౌడ్, నరేష్, జంగయ్యతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

### నూతన వధూవరులను

## ఆశీర్వదించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి...



షాద్ నగర్//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): షాద్ నగర్ నియోజకవర్గంలో జరిగిన పలు వివాహ వేడుకలకు హాజరైన ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లేడ్ చౌదరిగూడ, కొందుర్గు మండలాల్లో నిర్వహించిన వివాహాల్లో పాల్గొని కుటుంబ సభ్యులతో ముచ్చటించారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు,బీఆర్ఎస్ నాయకులు, గ్రామ సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గోదావరిఖని చౌరస్తా ఎల్లమ్మ బోనాలతో ప్రభంజనం...

నెత్తిన బోనమెత్తి గర్జించిన గౌడ మహిళలు...



గోదావరిఖని/ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): గౌడ బిడ్డల ఎల్లమ్మ బోనాలతో గోదావరిఖని చౌరస్తా ప్రాంగణం ప్రభంజనంలా మారింది. గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం ప్రథమ వార్షికోత్సవం, ఎల్లమ్మ మారు బోనాల సందర్భంగా మంగళవారం గౌడ సంఘం నాయకులు భక్తిశ్రద్ధలతో బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరిఖని ప్రాంతంలోని వివిధ కాలనీలు, డివిజన్ల నుండి గౌడ మహిళలు సంప్రదాయ దుస్తుల్లో నెత్తిన బోనాలు ఎత్తుకొని భారీగా చౌరస్తాకు తరలివచ్చారు. వేలాదిగా చేరుకున్న గౌడ మహిళలు, కుటుంబ సభ్యులతో చౌరస్తా ప్రాంగణం కిక్కిరిసిపోయి పండుగ వాతావరణం నెలకొంది. బోనాలతో ఊరేగింపుగా వచ్చిన మహిళలు సంప్రదాయ గీతాలు పాడుతూ, నృత్యాలతో ఎల్లమ్మ తల్లికి తమ భక్తిని చాటుకున్నారు.అనంతరం చౌరస్తా నుండి భారీ ఊరేగింపుగా బయలుదేరిన భక్తులు శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయానికి చేరుకొని ఆలయ ప్రాంగణంలో బోనాలను సమర్పించారు. తరువాత వేద పండితులు నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జమదగ్ని కళ్యాణ మహోత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో తిలకించారు.ఈ కార్యక్రమం ద్వారా గౌడ సమాజం ఐక్యతను చాటుకుంటూ, సంప్రదాయాలను గొప్పగా నిలబెట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. మొత్తం కార్యక్రమం ప్రశాంతంగా, భక్తిరసపూర్ణ వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# కూల్చివేతలకు పాల్పడుతున్న నెంబర్ ప్లేట్ లేని జెసిబిలను తగలబెట్టండి...

అర్ధరాత్రి అక్రమంగా కూల్చివేతలకు అడ్డాగా రామగుండం...

గుర్తుతెలియని వ్యక్తులచే కూల్చివేతలు చేస్తే తరిమికొట్టండి..

ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్యాయాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతాం...

బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి

గోదావరిఖని//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): రామగుండం నియోజకవర్గంలో నెంబర్ ప్లేట్ లేని జెసిబిలతో అర్ధరాత్రి కూల్చివేతలకు



పాల్పడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూల్చివేతలకు పాల్పడుతున్న నంబర్ ప్లేట్ లేని జెసిబిలను తగలబెట్టాలని బాధితులకు టిఆర్ఎస్ పార్టీ తరఫున అండగా ఉంటామని పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులతో కూల్చివేతలకు పాల్పడితే వారిని తరిమి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు.గోదావరిఖని ప్రధాన చౌరస్తా ప్రాంతంలో సాధారణ పేద కుటుంబాల ఆస్తులను అక్రమంగా కూల్చి వేయాలని సుమారుగా అర్ధరాత్రి మున్సిపల్, సింగరేణి అధికారులు ప్రయత్నించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ..."ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తే ప్రజలు తిరగబడతారని గుర్తు తెలియని వ్యక్తులచే నెంబర్ ప్లేట్ లేని జెసిబిలతో పేద వ్యాపార సముదాయాలను కూల్చడం సరైన పని కాదని అన్నారు. ప్రజలకు అండగా బిఆర్ఎస్ నిలుస్తుందని పేర్కొన్నారు. బాధితుల పక్షాన న్యాయబద్ధంగా పోరాడతాం," అని హెచ్చరించారు.గత రెండు రోజులుగా రామగుండం చౌరస్తా ప్రాంతంలోని పేద కుటుంబాలు తమ జీవితాధారమైన వ్యాపారాలను కొనసాగిస్తూ జీవనం సాగించగా, మున్సిపల్ అధికారులు అక్రమ కట్టడాలని సింగరేణి అధికారులు "చలో కూల్చేయండి" అని ఫోర్స్ చేసేందుకు ప్రయత్నించారని ఈ సమయంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పోలీసులను అడ్డుపెట్టారని హరీష్ రెడ్డి పేర్కొన్నారు. "ప్రజాస్వామ్యబద్ధంగా, న్యాయ స్థానంలోనే సమస్యను పరిష్కరిస్తామని గుర్తు తెలియని వ్యక్తులు, నెంబర్ ప్లేట్ లేని జెసిబిలు వాడుతూ రామగుండం వ్యాపారులను రోడ్డు మీద పడేస్తే, జెసిబిలను తగలబెట్టి నిరాకరించండని వారికీ బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజలతో ఉంటుందని అండగా నిలుస్తుందన్నారు.పోలీసులు చట్ట బద్ధంగా ప్రజలను రక్షించాల్సిన బాధ్యత మర్చిపోతున్నారని గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు మీద దాడులు చేయడం అన్యాయం అని పౌరుల హక్కుల





పరిరక్షణ కోసం సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునేలా కృషి చేస్తాం అని తెలిపారు. రామగుండం నగరంలో వ్యాపార అభివృద్ధికి, గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేసి ప్రజలను కాలుష్యంతో రక్షించాల్సిన బాధ్యత ఉన్న నాయకులు, బొగ్గు ఆధారిత పరిశ్రమల ద్వారా మరింత కాలుష్యానికి దారి తీసే విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.తెలంగాణలో బిఆర్ఎస్ ప్రభుత్వం కెసిఆర్ నేతృత్వంలో అక్రమ పాలనలో పాల్గొన్న అధికారులపై చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యురాలు తస్నీమ్ భాను, బొబ్బిలి సతీష్ యువజన విభాగం అధికార ప్రతినిధి బూరుగు వంశీకృష్ణ, అల్లీగణేష్, నడిపెల్లి సాయి, పోయిల రవి, కడమండ శ్రీహరి, కొండా సురేష్, జీనత్ తదితరులు పాల్గొన్నారు.

## అట్టడుగు వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం...

షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్...

ఏం.బి.సి కులాల అభివృద్ధి కార్పొరేషన్‌పై అసెంబ్లీలో సమీక్ష సమావేశం...



షాద్ నగర్//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): అట్టడుగు వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం తెలంగాణ అసెంబ్లీలో ఏం.బి.సి కులాల అభివృద్ధి కార్పొరేషన్ అమలు చేస్తున్న పథకాలపై ఆయన అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్, రజక ఫెడరేషన్ కార్పొరేషన్‌ల ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతిని సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 36,526 మంది నాయి బ్రాహ్మణులు మాత్రమే ఉచిత విద్యుత్ పథకానికి లబ్ధిదారులుగా ఉండటం పట్ల ఎమ్మెల్యే విస్మయం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నప్పటికీ అవి పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు చేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తోందని పేర్కొన్న ఆయన, కేటాయించిన బడ్జెట్‌ను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు చేరేటట్లు చేయడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నిధులు ల్యాప్స్ కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.త్వరలోనే బీసీ సంక్షేమ శాఖ అధికారులతో కలిసి నియోజకవర్గ స్థాయిలో ఉపకులాల వారీగా సమావేశాలు నిర్వహించి, వారి ఆర్థిక పరిస్థితులపై సమగ్ర నివేదిక సేకరించి ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. దీని ద్వారా ఆయా వర్గాలకు ప్రయోజనం చేకూరే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.ఈ సమావేశంలో శాసన సభ్యులు తోట లక్ష్మీకాంతరావు, పట్లోల సంజీవ్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మాయాదేవి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అలోక్ కుమార్, బీసీ ఫైనాన్స్ కమిషన్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్య భట్టు, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఎండి ఇందిరా, అసెంబ్లీ డిప్యూటీ సెక్రటరీ రఘుమ రెడ్డి, ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ మాధవి తదితరులు పాల్గొన్నారు.


## గోదావరిఖని చౌరస్తాలో బోనాల ప్రభంజనం...

రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ మైదానంలో ఫంక్షన్ హాల్‌కు రూ.25 లక్షలు ప్రకటించిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్...



గోదావరిఖని//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): గోదావరిఖని పట్టణంలో గౌడ మహిళల బోనాలతో ఎల్లమ్మ జాతర ప్రభంజనంలా మారింది. అశేష సంఖ్యలో మహిళలు బోనాలతో చౌరస్తాకు తరలివచ్చి తమ ఐక్యతను చాటారు. ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ హాజరై మహిళలకు స్వాగతం పలికారు.గోదావరిఖని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎల్లమ్మ మారు బోనాల కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. పట్టణం నలుమూలల నుంచి వచ్చిన గౌడ మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు మోసుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ గోదావరిఖనిలో ఎల్లమ్మ మారు బోనాలను ఇంత ఘనంగా నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన గౌడ సంఘం నాయకులను అభినందించారు. రామగుండం నియోజకవర్గంలో తన విజయంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని గుర్తుచేశారు.శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ మైదానంలో మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం రూ.25 లక్షలను అందిస్తానని బోనాల సాక్షిగా ప్రకటించారు. తాను ఇచ్చిన మాట తప్పనని, ఆ నిధులను తప్పకుండా విడుదల చేసి నిర్మాణాన్ని పూర్తి చేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, పలువురు కార్పొరేటర్లు, గౌడ సంఘం నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ జిల్లాలో బాలికలకు హెచ్‌పీవీ టీకాలు...



నాగర్ కర్నూల్ టౌన్//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండల పరిధిలోని లట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం హెచ్‌పీవీ (గర్భాశయ క్యాన్సర్ నిరోధక) టీకాలను అర్హులైన బాలికలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 14 మంది బాలికలకు టీకాలు అందజేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ టి. ప్రసన్న తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 2011 ఏప్రిల్ 1 నుండి 2012 మార్చి 31 మధ్య జన్మించిన బాలికలు తప్పని సరిగా హెచ్‌పీవీ టీకా తీసుకోవాలని సూచించారు. గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఈ టీకా ఎంతో కీలకమని, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆమె కోరారు.ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఈ టీకాలను విస్తృతంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ మేఘనా రెడ్డి, నర్సింగ్ అధికారి స్వరూప రాణి, పర్యవేక్షకులు బాలమణి, మహిళ ఆరోగ్య కార్యకర్తలు వరలక్ష్మి, జ్యోతి, విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో

## జాబ్ మేళా విజయవంతం...




నాగర్ కర్నూల్//ఏప్రిల్08(ఆకాంక్ష ) : నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో డైరీ సైన్స్, లైఫ్ సైన్స్ విద్యార్థుల కోసం నిర్వహించిన జాబ్ మేళా విజయవంతంగా ముగిసింది. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ మదన్మోహన్ వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాబ్ మేళాలో సుమారు 80 మంది అభ్యర్థులు పాల్గొన్నారని తెలిపారు. సిరవిన్ బయాలజికల్ లిమిటెడ్ లైబిలిటీ పార్ట్నర్షిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్ డ్రైవ్‌లో శంషాబాద్ ప్రాంతానికి చెందిన పలు కంపెనీలు పాల్గొన్నాయని చెప్పారు.ఈ మేళాలో అనిమల్ ఫార్మ్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్, జూనియర్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, 20 మందికి పైగా అభ్యర్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారిలో డైరీ సైన్స్ మరియు లైఫ్ సైన్స్ విద్యార్థులు అధికంగా ఉన్నారని పేర్కొన్నారు.విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ జాబ్ మేళాను నిర్వహించామని, ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరింతగా కొనసాగిస్తామని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో లైఫ్ సైన్స్ అధ్యాపకులు కోదండరాములు, డైరీ సైన్స్ అధ్యాపకుడు దశరథం యాదవ్, అలాగే అధ్యాపకులు అంజయ్య, వనిత, ఉమాదేవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### మహిళల స్వయం ఉపాధికి

## ఆరాధ్య ఫౌండేషన్ ముందడుగు...

శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేసిన కౌన్సిలర్ గుంపల్లి కవిత...



నాగర్ కర్నూల్//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధి,స్వయం ఉపాధి సాధన లక్ష్యంగా ఆరాధ్య ఇంటిగ్రేటెడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టైలరింగ్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేసి ప్రోత్సహించారు . సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలరింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్" పేరిట నిర్వహించిన ఈ శిక్షణలో గ్రామీణ ప్రాంతాల మహిళలకు నెల రోజులపాటు కుట్టు విద్యపై ప్రాక్టికల్ మరియు థియరీ పాఠాలు బోధించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు తమ గ్రామాల్లోనే స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకునేలా మార్గదర్శనం చేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ గుంపల్లి కవిత మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇటువంటి నైపుణ్య శిక్షణలు కీలకమని అన్నారు. మహిళలు తమ ప్రతిభను ఉపయోగించుకొని కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచుకోవాలని సూచించారు.జిల్లా ఇన్‌చార్జ్ ఎంజి మణిసాగర్, ఎంజి భ్రమరాంబ దేశిటిక్యాల మాట్లాడుతూ ఆరాధ్య ఫౌండేషన్ మహిళల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉపాధి ఆధారిత శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమం ద్వారా పలువురు మహిళలు కుట్టు విద్యలో నైపుణ్యం సంపాదించి స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేస్తుండటం విశేషం.

## నాగర్ కర్నూల్ జిల్లాలో ఏఎస్ఐగా బద్రి నాయక్ పదోన్నతి...

అభినందించిన ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్...




నాగర్ కర్నూల్//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): పోలీస్ శాఖలో పదోన్నతి సాధించడం గర్వకారణమేకాకుండా బాధ్యతలను మరింతగా పెంచే అంశమని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బద్రి నాయక్ ఇటీవల అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ (ఏఎస్ఐ)గా పదోన్నతి పొందిన సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ తన చేతుల మీదుగా బద్రి నాయక్‌కు ఏఎస్ఐ హోదాకు సంబంధించిన స్టార్స్ అలంకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పదోన్నతి పొందిన బద్రి నాయక్‌కు అభినందనలు తెలుపుతూ, భవిష్యత్తులో మరింత ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతి అనేది కేవలం పదవిలో ఉన్నత స్థానానికి ఎదగడమే కాకుండా, ప్రజల పట్ల మరింత బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తుందని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడి సమస్యలను సానుభూతితో వినడం, వారికి తక్షణ సహాయం అందించడం, న్యాయం జరిగేలా కృషి చేయడం ప్రతి పోలీస్ సిబ్బంది కర్తవ్యమని స్పష్టం చేశారు.ముఖ్యంగా మహిళలు, పిల్లలు, నిరుపేదలు వంటి బలహీన వర్గాలకు పోలీసులు అండగా నిలవాలని సూచించారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావం వంటి విలువలను పాటిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందాలని అన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిస్తే భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు, గుర్తింపు లభిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఒడిశా వలస కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ...



నాగర్ కర్నూల్ టౌన్//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): మండలంలోని పెద్ద ముద్దునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తూడుకుర్తి గ్రామంలో వలస కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికులకు హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు సుమారు 30 మందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కార్మికులకు సూచించారు. ముఖ్యంగా ఎక్కువ వేడి సమయంలో నీళ్లు తరచుగా తాగడం, మధ్యాహ్న వేళల్లో బయట పనులను తగ్గించడం అవసరమని తెలిపారు. ఓఆర్ఎస్ ద్రావణంలో సోడియం, పొటాషియం, గ్లూకోజ్ వంటి లవణాలు ఉండి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయని వివరించారు. దీనివల్ల శరీరంలో నీరు తగ్గిపోవడం (డీహైడ్రేషన్) నివారించవచ్చని చెప్పారు. ఎండల కారణంగా అలసట, తలనొప్పి, నీరసం వంటి లక్షణాలు కనిపించినప్పుడు ఓఆర్ఎస్ తాగితే త్వరగా ఉపశమనం లభిస్తుందని తెలిపారు. చిన్నపిల్లలు, పెద్దలు అన్న తేడా లేకుండా అవసరమైనప్పుడు ఓఆర్ఎస్‌ను వినియోగించుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన సూచించారు.

### నాగర్ కర్నూల్ జిల్లాలో

## మీడియా అక్రిడేషన్ కమిటీకి జర్నలిస్టుల ఎంపిక...



నాగర్ కర్నూల్//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): నాగర్ కర్నూల్ జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులుగా పలువురు జర్నలిస్టులను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. జిల్లా స్థాయిలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అక్రిడేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ కమిటీ కీలకంగా పని చేయనుంది. ఎంపికైన వారిలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్, డైలీ న్యూస్ పేపర్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు పలుస విజయ్ కుమార్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధిగా జి. సాయిలు సాగర్, ఫోటో జర్నలిస్టు ప్రతినిధిగా నేతాజీ గౌడ్, మీడియం డైలీ న్యూస్ పేపర్ నుండి ఎం. శ్రీనివాసులు, ఉర్దూ డైలీ న్యూస్ పేపర్ నుండి ముబిన్ అహ్మద్ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త కమిటీ ద్వారా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమపై విశ్వాసం ఉంచి అక్రిడేషన్ కమిటీకి ఎంపిక చేసిన తెలంగాణ మీడియా అకాడమీకి కృతజ్ఞతలు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు అందేలా కృషి చేస్తామని, పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు.

### మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్‌కు

## టీఎన్జీవో జిల్లా డైరీ అందజేత...



నాగర్ కర్నూల్//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): నాగర్ కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్ల గ్రామంలో టీఎన్జీవో ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ గారికి టీఎన్జీవో జిల్లా డైరీని ఘనంగా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని కొల్లాపూర్ డివిజన్ టీఎన్జీవో యూనియన్ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ డివిజన్ టీఎన్జీవో అధ్యక్షులు జీకే వెంకటేష్, కార్యదర్శి సురేందర్ కలిసి జిల్లా డైరీని సూర్య ప్రతాప్ గౌడ్ కి వారి స్వగృహంలో అందజేశారు. కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా టీఎన్జీవో కార్యదర్శి షర్ఫుద్దీన్ ముఖ్య పాత్ర పోషించారు. డైరీ అందుకున్న అనంతరం మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో టీఎన్జీవో ఉద్యోగులు ప్రభుత్వ ఆశయాల సాధనలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజాసేవలో ఉద్యోగులు మరింత నిబద్ధతతో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులతో పాటు గ్రామానికి చెందిన ప్రముఖులు కూడా పాల్గొన్నారు. వారిలో మాజీ సర్పంచ్‌లు పగడాల చెన్నయ్య, విజయుడు, మాజీ ఎంపిటీసీ డి. రవికుమార్, మాజీ ఉపసర్పంచ్ మేకల మల్లేష్, వార్డు సభ్యులు వంగూరి రాంప్రసాద్, ఓర్సు చిన్న సుల్తాన్, బొల్లె ఈశ్వరయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కరీంనగర్ జిల్లాలో కేటీఆర్ పర్యటన...

### జీవన్ రెడ్డిని బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించే ప్రయత్నం...



కరీంనగర్//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రేపు కరీంనగర్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో రాజకీయంగా కీలకమైన సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. రేపు మధ్యాహ్నం 12:30 గంటలకు కరీంనగర్‌లోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులతో కేటీఆర్ సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు సమాచారం. ఈ సమావేశం అనంతరం కేటీఆర్ బీఆర్ఎస్ నేతలతో కలిసి జగిత్యాల వైపు పయనమవుతారు. అక్కడ మధ్యాహ్నం 2:30 గంటలకు జగిత్యాల నియోజకవర్గంలో మాజీ మంత్రి టీ జీవన్ రెడ్డి నివాసంలో మరో కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి కూడా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఇప్పటికే కేటీఆర్ మాజీ మంత్రి జీవన్ రెడ్డితో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించేందుకు కేటీఆర్ ప్రత్యేకంగా ఈ పర్యటనను ప్లాన్ చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. జీవన్ రెడ్డి నిర్ణయం జిల్లాలో రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామాలు కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. కేటీఆర్ పర్యటన, జరగబోయే సమావేశాలు, ముఖ్యంగా జీవన్ రెడ్డితో భేటీపై రాజకీయ వర్గాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.

## కోదాడలో న్యాయవాదుల ఆందోళన...

### యువ న్యాయవాది ఎల్లయ్య హత్యపై తీవ్ర నిరసన...



కోదాడ//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): ఆంధ్రప్రదేశ్‌లో యువ న్యాయవాది పూజారి ఎల్లయ్య హత్యకు నిరసనగా కోదాడ పట్టణంలో బుధవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కోదాడ కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. హత్యకు కారణమైన వారిని ప్రభుత్వం వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. న్యాయం కోసం పోరాడే న్యాయవాదులకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనను ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా వేగంగా విచారణ జరిపించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. న్యాయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం నిలుపుకోవాలంటే ఇలాంటి ఘటనలపై కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గట్ల నరసింహారావు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ, కోశాధికారి కోడూరు వెంకటేశ్వరరావు, లైబ్రరీ సెక్రటరీ గాలి శ్రీనివాస్ నాయుడు, సీనియర్ న్యాయవాదులు నాగార్జున, సుధాకర్ రెడ్డి, రంగారావు, కాకర్ల వెంకటేశ్వర్లు, హేమలత, రంజాన్ పాషా, నాగుల్ పాషా, హనుమంతరావు, పెద్దబ్బాయి, అబ్దుల్ రహీం, ఉయ్యాల నరసయ్య, రియాజ్, తాటి మురళి, రమేష్ బాబు, శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాల్లో ఒత్తిడితో బీపీ, షుగర్ వచ్చాయి...

### అబద్ధాలు చెప్పలేకే ఓటమి...

### జగన్ నేతృత్వంలో అభివృద్ధి చేసి చూపించాం...

### కూటమి ప్రభుత్వంపై ఆర్కే రోజా వ్యాఖ్యలు...



నగరి//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) నాయకురాలు ఆర్కే రోజా రాజకీయాల్లో తన అనుభవాలు, ఎదుర్కొన్న ఆరోగ్య సమస్యలు మరియు ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల పదవీకాలం పూర్తి చేసుకున్న వైసీపీ సర్పంచ్‌లను నగరిలోని తన నివాసంలో సన్మానించిన సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ రాజకీయాలు అంటేనే మానసిక ఒత్తిడితో కూడుకున్నవని పేర్కొన్నారు. తాను మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన సమయంలో రక్తపోటు (బీపీ) సమస్యలు వచ్చాయని, రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మధుమేహం (షుగర్) బారిన పడ్డానని తెలిపారు. ప్రజా జీవితంలో ఒత్తిడులు సహజమని, అయినప్పటికీ ప్రజల సేవే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించామని రోజా పేర్కొన్నారు. ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను పరిష్కరించడం తమ పార్టీ సంస్కృతి అని ఆమె వివరించారు. ఎన్నికల సమయంలో కూటమి నేతల మాదిరిగా తాము అబద్ధాలు చెప్పలేకపోయామని, అందువల్లే ఓటమిని చవిచూశామని ఆమె వ్యాఖ్యానించారు. అయినప్పటికీ వైసీపీ సర్పంచ్‌లు తమ తమ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో గౌరవంగా తిరిగే స్థాయిని సంపాదించారని ప్రశంసించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా కృషి చేసి వైసీపీ సత్తాను మళ్లీ చాటాలని రోజా పిలుపునిచ్చారు. అబద్ధాలతో గెలిచిన నాయకులకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని ఆమె అన్నారు.

### కొమురవెల్లి గ్రామంలో

## ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ కార్యక్రమం...



కొమురవెల్లి//ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): కొమురవెల్లి మండల కేంద్రంలోని కొమురవెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ (ముగ్గు పోయడం) కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చడం లక్ష్యమని నాయకులు తెలిపారు. ఈ పథకం ద్వారా అనేక మంది నిరుపేదలకు నివాస సౌకర్యం కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తోందని పేర్కొన్నారు. ఇందుకు గాను రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి కొమురవెల్లి మండల కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు లింగంపల్లి కనకరాజు, గ్రామ సర్పంచ్ పద్మ, మండల కాంగ్రెస్ పార్టీ సెక్రటరీలు సార్ల లింగం, స్వాములపల్లి రమేష్, బీసీ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఏర్పుల రాజు, యూత్ సెక్రటరీలు ఉప్పల వంశీ, ఎనిశెట్టి కిరణ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు లింగంపల్లి శ్రీనివాస్, పబ్బోజు రాహుల్ చారి, సార్ల కోల్ బాయ్ కనకయ్య, గీస లింగం, గొదల నవీన్, పంచాయతీ కార్యదర్శి రాజు గౌడ్, లింగంపల్లి బాల్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా గ్రామ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు.

### శుద్ధి చేసిన యురేనియంను

## అప్పగించకపోతే ఇరాన్‌పై మళ్లీ దాడులు : అమెరికా

### కాల్పుల విరమణ కోసం ఇరాన్ ప్రాధేయపడింది- అమెరికాకు 47 ఏళ్లుగా పొంచి ఉన్న ముప్పు తొలిగింది: అమెరికా రక్షణమంత్రి హెగ్సెత్

శుద్ధి చేసిన యురేనియంను ఇరాన్ తమకు అప్పగించకపోతే మళ్లీ దాడులు చేపడతామని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ తెలిపారు. అమెరికా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, ఇరాన్‌తో యుద్ధంలో తాము నిర్దేశించిన అన్ని లక్ష్యాలను చేరుకున్నామని చెప్పారు. ఇరాన్‌తో ఇక ముప్పు లేదని అన్నారు. అధ్యక్షుడు ట్రంప్ వల్లే ఈ అద్భుత క్షణాలు సాకారమయ్యాయని వ్యాఖ్యానించారు. కాల్పుల విరమణ కోసం ఇరాన్ ప్రాధేయపడిందని, ఈ విషయం అందరికీ తెలుసని హెగ్సెత్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై తాము చేపట్టిన ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ చరిత్రాత్మకమైనదని అన్నారు. ఈ ఆపరేషన్‌లో అమెరికా బలగాలు ఇరాన్ సైన్యాన్ని నామరూపాల్లేకుండా చేశాయని ఉద్ఘాటించారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థను నిమిషాల్లోనే కుప్పకూల్చే సామర్థ్యం ఉన్నా, అధ్యక్షుడు దయ చూపించారని హెగ్సెత్ తెలిపారు. తాము విధించిన షరతులకు ఇరాన్ ఒప్పుకోకపోయి ఉంటే వారి విద్యుత్ కేంద్రాలు, వంతెనలు, ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని భీకర దాడులు జరిగేవని వెల్లడించారు. ద"కాల్పుల విరమణ ఒప్పందం కోసం ఇరాన్ ప్రాధేయపడింది. ఈ విషయం మన అందరికీ తెలుసు. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ చరిత్రాత్మకం. యుద్ధంలో అద్భుత విజయం సాధించాం. మా పోరాట దళాల్లో ఒకటైన సెంట్రల్ కమాండ్ కేవలం 10శాతం మంది సిబ్బందితో, ప్రపంచంలోనే అతి పెద్ద సైన్యాన్ని నామరూపాల్లేకుండా చేసింది. ఇరాన్ మా షరతులకు అంగీకరించకుంటే ఆ దేశ విద్యుత్ కేంద్రాలు, వంతెనలు, ఇంధన కేంద్రాలపై దాడులు జరిగేవి. ఇరాన్ ఆర్థిక వ్యవస్థను నిమిషాల్లోనే కుప్పకూల్చే సామర్థ్యం ఉన్నా ఆయన (ట్రంప్) దయ చూపించారు."

పీట్ హెగ్సెత్, అమెరికా రక్షణ మంత్రి

ఇరాన్‌తో ప్రత్యక్ష చర్చల ప్రణాళికలపై ఏదీ ఇంకా ఖరారు కాలేదు : వైట్‌హౌస్

మరోవైపు ఇరాన్‌తో ప్రత్యక్ష చర్చల ప్రణాళికలపై ఏదీ ఇంకా ఖరారు కాలేదని వైట్‌హౌస్ వెల్లడించింది. ఈ వారం చివర్లో పాకిస్థాన్‌లో జరగనున్న అమెరికా- ఇరాన్ చర్చల్లో పాల్గొనడంపై ప్రశ్నించగా వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లెవిట్ ఈ మేరకు స్పందించారు. ప్రత్యక్ష చర్చల గురించి సంప్రదింపులు జరుగుతున్నాయని, కానీ అధ్యక్షుడు లేదా వైట్‌హౌస్ అధికారికంగా ప్రకటించేంత వరకు ఏదీ ఖరారు అయినట్లు కాదన్నారు.

ఇరాన్‌లో పాలన మార్పును స్వాగతించిన ట్రంప్

ఇదిలా ఉండగా ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేశారు.

### రైతులు, చేనేతల సమస్యలపై జాగృతి పోరాటం...

### ప్రశ్నిస్తాం.. పోరాడుతాం.. పరిష్కరిస్తాం...

### ప్రజలను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మోసం చేస్తున్నాయి...

### గద్వాల్ నుంచి జాగృతి జోరు.. మొదటి విజయానికి నాంది...

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత...

## ఢిల్లీకి గులాంగిరీ చేస్తున్న ప్రభుత్వం...





హైదరాబాద్/ఏప్రిల్ 08 (ఆకాంక్ష ): తెలంగాణ జాగృతి కార్యాలయం బంజారాహిల్స్‌లో బుధవారం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్న కార్యక్రమం జరిగింది. నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్ తన అనుచరులతో కలిసి తెలంగాణ జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా జాగృతి నేత కల్వకుంట్ల కవిత కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కవిత, ఏప్రిల్ 25ను తెలంగాణ భవిష్యత్‌ను మార్చే కీలక దినంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్త తరహా రాజకీయాలను పరిచయం చేస్తామని, ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తూ, పోరాడుతూ పరిష్కారాలను అందించే రాజకీయ పంథాను తీసుకువస్తామని తెలిపారు. సామాన్యుల చేత, సామాన్యుల కొరకు, సామాన్యులే ఉండే రాజకీయ వ్యవస్థను నెలకొల్పడమే లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని కవిత విమర్శించారు. ప్రజల సమస్యలను ప్రస్తావించే శక్తిగా తెలంగాణ జాగృతి నిలుస్తోందని చెప్పారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీ ఆధీనంలో పనిచేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర నాయకత్వానికి లోబడి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రైతు భరోసా, రుణమాఫీ వంటి హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అప్పర్ భద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించినప్పటికీ, దాని ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని కవిత అన్నారు. దీని వల్ల తుంగభద్ర నీటి పంపిణీపై ప్రభావం పడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నష్టపోతుందని తెలిపారు. గద్వాల్ ప్రాంతంలో చేనేత కార్మికులు, సీడ్ పత్తి రైతులు ఇంకా సమస్యలతోనే ఉన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఇవ్వాల్సిన బకాయిలు, ఆర్డర్లు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు రంజిత్ కమిట్‌మెంట్ ఉన్న నాయకుడని



కవిత కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం జాగృతి ప్రారంభించబోయే కొత్త రాజకీయ పార్టీలో ఆయన వంటి నాయకులు కీలక పాత్ర పోషిస్తారని చెప్పారు. మూడు సంవత్సరాల పాటు ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తామని, అంతర్జాతీయ స్థాయి నిపుణులతో కలిసి ప్రజల సంక్షేమానికి అద్భుతమైన అజెండాను రూపొందిస్తున్నామని కవిత వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు తెలంగాణలో కొత్త రాజకీయాలకు శ్రీకారం చుడుతామని, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటామని పేర్కొన్నారు.

## హార్మూజ్‌పై ఐరాసలో తీర్మానం- వ్యతిరేకించిన రష్యా, చైనా- ఖచ్చి వైఫల్యమంటూ జెలెన్ స్కీఫైర్ !

### బహ్రెయిన్ మద్దతుతో వచ్చిన తీర్మానానికి భద్రతా మండలిలో అడ్డంకి- 11 దేశాలు అనుకూలం, చైనా, రష్యా వ్యతిరేకం- ఇరాన్ చర్యలపై కఠిన డిమాండ్లు ఉన్న ముసాయిదా- యూఎన్ వైఫల్యమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ విమర్శ

ప్రపంచ ఇంధన సరఫరా, అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకమైన హార్మూజ్ జలసంధి అంశంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ప్రవేశపెట్టిన కీలక తీర్మానం ఆమోదం పొందకుండా వీగిపోయింది. గల్ఫ్ దేశాల మద్దతుతో బహ్రెయిన్ తీసుకువచ్చిన ఈ ముసాయిదాను చైనా, రష్యా వీటో చేయడంతో తీర్మానం ముందుకు సాగలేదు. ఈ తీర్మానంపై ఓటింగ్ నిర్వహించినప్పుడు 15 సభ్యుల భద్రతా మండలిలో 11 దేశాలు అనుకూలంగా ఓటు వేయగా, చైనా, రష్యా వ్యతిరేకంగా ఓటు వేశాయి. పాకిస్థాన్, కొలంబియా ఓటింగ్‌కు దూరంగా నిలిచాయి. దీంతో అవసరమైన మద్దతు ఉన్నప్పటికీ, శాశ్వత సభ్య దేశాల వీటో కారణంగా తీర్మానం అమలు దశకు చేరుకోలేకపోయింది. ఈ ముసాయిదాను బహ్రెయిన్, కువైట్, ఒమాన్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి గల్ఫ్ సహకార మండలి దేశాలు కలిసి రూపొందించాయి. అదేవిధంగా జోర్డాన్ కూడా దీనికి మద్దతు తెలిపింది. ప్రాంతీయ భద్రత, సముద్ర మార్గాల స్వేచ్ఛను కాపాడే లక్ష్యంతో ఈ తీర్మానాన్ని ముందుకు తెచ్చారు. తీర్మానం ప్రకారం ఇరాన్ వెంటనే వాణిజ్య, సరుకు రవాణా నౌకలపై దాడులు నిలిపివేయాలని స్పష్టంగా డిమాండ్ చేశారు. హార్మూజ్ జలసంధిలో నావిగేషన్ స్వేచ్ఛను అడ్డుకునే చర్యలను ఆపాలని సూచించారు. అంతేకాకుండా నీటి వనరులు, డీసాలినేషన్ ప్లాంట్లు, చమురు, వాయు మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను కూడా వెంటనే నిలిపివేయాలని కోరారు. అయితే ఈ తీర్మానం పూర్తి పరిస్థితిని ప్రతిబింబించలేదని చైనా అభిప్రాయపడింది. సమస్య మూల కారణాలను పట్టించుకోకుండా ఒకపక్షంగా తీర్మానం రూపొందించారని విమర్శించింది. మరోవైపు రష్యా కూడా ఈ తీర్మానాన్ని ప్రమాదకరమైన విధానంగా అభివర్ణించింది. ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై జరిపిన దాడుల ప్రస్తావన ఇందులో లేకపోవడాన్ని రష్యా తీవ్రంగా వ్యతిరేకించింది. తీర్మానం వీగిపోవడంతో బహ్రెయిన్ విదేశాంగ మంత్రి అబ్దుల్లతీఫ్ బిన్ రషీద్ అల్ జయాని నిరాశ వ్యక్తం చేశారు. అంతర్జాతీయ జలమార్గాల భద్రతకు ముప్పు ఉన్న సమయంలో భద్రతా మండలి స్పష్టమైన చర్యలు తీసుకోలేకపోవడం ప్రపంచానికి తప్పుడు సంకేతమని అన్నారు. అమెరికా ప్రతినిధులు మాత్రం గల్ఫ్ దేశాల ప్రజలకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. హార్మూజ్ జలసంధి ప్రపంచానికి అత్యంత కీలకమని, దాన్ని ఏ దేశం ఆయుధంగా ఉపయోగించకూడదని హెచ్చరించారు. ఇక ఈ పరిణామాలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ తీవ్రంగా స్పందించారు. ఇరాన్ చర్యల వల్ల ప్రపంచ స్థాయిలో ఏర్పడుతున్న ప్రమాదాన్ని ఎదుర్కొనే విషయంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి మరోసారి వైఫల్యం చెందిందని విమర్శించారు. హార్మూజ్ జలసంధి అన్ని దేశాలకు తెరిచి ఉండాల్సిందేనని, అంతర్జాతీయ వాణిజ్యం నిరవధికంగా కొనసాగాలంటే ఇది అత్యవసరమని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఈ జలసంధి పాత్ర ఎంతో కీలకం. మధ్యప్రాచ్య దేశాల నుంచి చమురు,